**నేటి కందం-నేటికి అందం**

మానిత భారతమునకే
ప్రాణాధికముగ సతతము బరగెడి స్వేచ్ఛా
వాణిజ్యపు టొప్పందము
రాణింపగ జేయు న్యూజిలాండును గూడన్ !!

)భారత్ న్యూజిల్యాండ్ దేశాల మధ్య నెలకొన్న స్వేచ్ఛా వాణిజ్యపు టొప్పందం రెండు దేశాలకూ లాభదాయకంగా ఉంటుందని రెండు దేశాల ప్రజలూ సంతోషిస్తున్నారు)

-రాధశ్రీ
సెల్:9494481210



# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433 E-mail:netinijam93@gmail.com

**చురక**

రాజకీయ విమర్శలు
రాలిపోయే ఆకులే
విశ్వాసం పెట్టుకుంటే
విజయానికి షాకులే
నిజమేంటో జనం రోజు
నిగ్గుతేల్చుకుంటరు
పాలు నీళ్ల హంసలాగ
పసిగట్టుతుంటరు

-వేల్పుల నారాయణ
9440433475



హైదరాబాద్ బుధవారం 23-9-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :33 సంచిక:45 పేజీలు:6 వెల: రూ.1/-


## బొల్లారం ఆయుధాల చోరీ కేసు వెలుగులోకి సంచలన విషయాలు



హైదరాబాద్, సెప్టెంబర్ 22: బొల్లారంలోని మద్రాస్ రెజిమెంట్‌లో ఆయుధాల చోరీ కేసులో నిందితుడు మల్లేష్‌ను విచారించిన పోలీసులు.. అతడి నుంచి పలు సంచలన విషయాలు రాబట్టారు. నాలుగు నెలల ముందే అతడు ఈ ఆయుధాల చోరీకి పథక రచన చేసినట్లు బొల్లారం పోలీసులు గుర్తించారు. ఆదివారం.. సెలవు దినం కాబట్టి ఆ రోజే ఆయుధాలను చోరీ చేయాలని అతడు ముందుగా ప్లాన్ వేశాడని తెలిపారు. ఈ క్రమంలో ఆదివారం రోజు గార్డ్ ఇన్‌చార్జ్‌లు, ఆర్మీ అధికారుల కదలికలు తక్కువగా ఉంటాయని అతడు గుర్తించి.. ఈ నిర్ణయం తీసుకున్నాడని వివరించారు. దీంతో ఆ రోజే ఆయుధాల చోరీకి అతడు స్కెచ్ వేశాడని చెప్పారు.

అలాగే చోరీ చేసిన ఆయుధాలను సంఘ విద్రోహశక్తులకు విక్రయించాలని మల్లేష్ భావించాడని పోలీసులు పేర్కొన్నారు. అందుకోసం ఆయుధాలు కొనుగోలు చేసే వ్యక్తుల కోసం సోషల్ మీడియాలో అతడు తీవ్రంగా వెతికినట్లు గుర్తించామని పోలీసులు తెలిపారు. తద్వారా వచ్చిన నగదుతో తన ఆర్థిక నష్టాలను పూడ్చుకోవాలని మల్లేష్ నిర్ణయించాడని అన్నారు. మూడేళ్ల పాటు సర్వీస్ ఉన్నప్పటికీ.. విధుల నుంచి తొలగించడంతో ఆర్మీ అధికారులపై మల్లేష్ కక్ష పెంచుకున్నాడని తెలిపారు.

దీంతో మద్రాస్ బెటాలియన్ నుంచి ఆయుధాలు చోరీ చేయడం ద్వారా ఆ అధికారుల ప్రతిష్ఠ దెబ్బతీయాలని మల్లేష్ ఈ పథకం వేశాడని వివరించారు. దాదాపు 16 ఏళ్ల పాటు మద్రాస్ రెజిమెంట్‌లో మల్లేష్ విధులు నిర్వహించాడని పోలీసులు చెప్పారు. ఆ అనుభవంతోనే ఆయుధాలు చోరీ చేసినట్లు తమ దర్యాప్తులో గుర్తించామని పేర్కొన్నారు.

ఇక ఆర్మీలో తన స్నేహితులు ఇన్‌చార్జ్ నాయక్ వినోద్, మ్యాగజైన్ ఇన్‌చార్జ్ బల్లి మధు, గార్డ్ ఇన్‌చార్జ్ హవాల్దార్ కేవీ రమణతోపాటు క్వార్టర్ గార్డ్ ఇన్‌చార్జ్ నిరేష్‌తో మల్లేష్ తరచూ ఫోన్ కాల్స్ మాట్లాడినట్లు గుర్తించామని పోలీసులు వివరించారు. ఆర్మీ స్నేహితులతో మాట్లాడి మద్రాస్ రెజిమెంట్‌లో సీసీటీవీ కెమెరాలు.. ఎప్పుడు ఆఫ్ చేస్తున్నారంటూ వారిని మల్లేష్ ఆరా తీసిన వారు వెల్లడించారు.

## వర్గాలను దృష్టిలో పెట్టుకునే సంక్షేమ పథకాల అమలు: సీఎం రేవంత్ రెడ్డి



హైదరాబాద్, సెప్టెంబర్ 22: దళితులు, ఆదివాసీ, గిరిజనుల అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. సొంత తల్లిలా ప్రేమ చూపించిన ఇందిరమ్మను వారు ఇప్పటికీ మరిచిపోలేదన్నారు. ఈరోజు(మంగళవారం) సచివాలయంలో ూఅ,ూు అట్రాసిటీ నిరోధక చట్టం అమలుపై కమిటీ సమావేశంలో సీఎం మాట్లాడుతూ.. 25 లక్షల ఎకరాలకు అసైన్డ్ పట్టాలు అందించిన ఘనత ఇందిరా గాంధీది అని కొనియాడారు. ఆమె స్ఫూర్తితోనే ఈ ప్రభుత్వం పనిచేస్తోందని వెల్లడించారు. ప్రభుత్వం ఈ వర్గాల కోసం చిత్తశుద్ధితో పనిచేస్తోందని స్పష్టం చేశారు. ఇందిరమ్మ ఇళ్లలో 31 శాతం లబ్ధిదారులు దళితులే అని తెలిపారు. ఎస్టీలకు 17 శాతం ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశామని చెప్పారు. రాష్ట్రంలో 27.5 లక్షల మంది విద్యార్థులకు నర్సరీ నుంచి పన్నెండో తరగతి వరకు బ్రేక్ ఫాస్ట్ అందిస్తున్నామని సీఎం తెలిపారు. రాష్ట్రంలో 3 కోట్ల 48 లక్షల మందికి తెలంగాణలో సన్న బియ్యం అందిస్తున్నామన్నారు. సన్న బియ్యంతో దళిత, గిరిజన వర్గాలకు మంచి భోజనం అందించగలుగుతున్నామని తెలిపారు. దళితులు, గిరిజనులు, ఆదివాసీలను దృష్టిలో ఉంచుకుని సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని చెప్పారు. అత్యాచార ఘటనలపై ప్రభుత్వం మానవీయ కోణంలో స్పందిస్తోందన్నారు. బాధితులకు నష్టపరిహారాన్ని బడ్జెట్‌తో ముడిపెట్టకుండా గ్రీన్ ఛానెల్‌లో విడుదల చేయాలని అధికారులను ఆదేశించారు. చదువొక్కటే జీవితాలను మారుస్తుందని.. అట్టడుగు వర్గాలను చదువు వైపు నడిపించకపోతే సమస్య పరిష్కారం కాదన్నారు. 'పిల్లల్ని చదువు వైపు, క్రీడలవైపు ప్రోత్సహించండి. రాజకీయాలకు అతీతంగా ఈ వర్గాల అభివృద్ధి చేసుకుందాం. ఈ ప్రభుత్వం మీది.. మీకోసం పనిచేస్తుంది' అని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

## జూరాలకు ప్రాజెక్టు కొనసాగుతున్న ఇన్‌ఫ్లో.. 8.949 టీఎంసీలకు చేరిన నీటి నిల్వ



జోగులాంబ సెప్టెంబర్ 22:ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతాల నుంచి నీటి ప్రవాహం కొనసాగు తోంది. మంగళవారం ఉదయం 6 గంటల సమయానికి ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టానికి సమీపంలో ఉంది. ప్రస్తుత నీటిమట్టం 318.17 మీటర్లు కాగా, పూర్తి స్థాయి నీటిమట్టం (ఈఖీఒ) 318.516 మీటర్లుగా ఉంది.

ఃప్రాజెక్టులోకి ప్రస్తుతం 1,500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. ప్రాజెక్టులో 8.949 టీఎంసీల నీటి నిల్వ ఉంది. ఇది గరిష్ఠ నిల్వ సామర్థ్యం 9.657 టీఎంసీలలో 92.66 శాతం. ప్రస్తుతం నదిలోకి ఔట్‌ఫ్లో లేదు. స్పిల్‌వే ద్వారా, పవర్‌హౌస్ ద్వారా కూడా నీటి విడుదల నిలిచిపోయింది. ప్రాజెక్టు వద్ద నీటి నిల్వ గరిష్ఠ స్థాయికి చేరువలో ఉండటంతో అధికారుల పర్యవేక్షణ కొనసాగుతోంది.

## రాజ్యసభ సీట్లకు ఎన్నిక.. 12 స్థానాలకు నోటిఫికేషన్.. అక్టోబర్ 16న ఎన్నిక

న్యూ ఢిల్లీ, సెప్టెంబర్ 22:రాజ్యసభ ఎన్నికలకు కేంద్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ విడుదల చేసింది. దేశంలోని 12 రాజ్యసభ స్థానాలకు సెప్టెంబర్ 22, మంగళవారం నోటిఫికేషన్ విడుదలైంది. వీటిలో యూపీలో 10 స్థానాలకు, ఉత్తరాఖండ్‌లో ఒక స్థానానికి ఎన్నిక జరగనుండగా, పశ్చిమ బెంగాల్‌లో ఒక స్థానానికి ఉప ఎన్నిక జరగనుంది. అక్టోబర్ 16న ఎన్నిక జరగనుంది. అదే రోజు ఫలితాలు విడుదలవుతాయి. కొందరు రాజ్యసభ సభ్యుల కాల పరిమితి నవంబర్ 25న ముగియనుంది.

ఈ స్థానాల భర్తీ కోసం తాజా ఎన్నికలు జరుగుతాయి. ఇందులో యూపీలో ఉన్న 10 స్థానాల్లో 8 స్థానాలు బీజేపీవి, ఒకటి ఎస్పీది, ఇంకోటి బీఎస్పీది. కాల పరిమితి ముగియనున్న రాజ్యసభ సభ్యుల్లో కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ పూరి ఉన్నారు. ప్రస్తుతం ఉన్న అంచనా ప్రకారం.. అసెంబ్లీలో ఉన్న స్థానాలను బట్టి యూపీలోని 10 స్థానాల్లో 8 బీజేపీ గెలుచుకునే అవకాశం ఉంది. 2 సీట్లు సమాజ్‌వాదీ పార్టీ గెలుచుకోనుంది. సిట్టింగ్ రాజ్యసభ ఎంపీని కలిగి ఉన్న బీఎస్పీ ఒక్క సీటు కూడా గెలుచుకునే అవకాశం లేదు. ఎందుకంటే ఆ పార్టీకి యూపీ అసెంబ్లీలో సభ్యులు లేనందున ఆ పార్టీకి రాజ్యసభ సీటు దక్కే అవకాశం లేదు.ఇలీవఇ-బీబితిలవ ఃతీజీనిఇష్ట్ర

బీఎస్పీకి ఇది క్లిష్టకాలంగా చెప్పుకోవాలి. ఎందుకంటే యూపీ అసెంబ్లీలోని ఉభయ సభల్లో ఒక్కరు కూడా లేరు. పార్లమెంట్ ఉభయ సభల్లో కూడా ఒక్క సభ్యుడూ లేడు. అంటే, రాష్ట్రంలో, కేంద్రంలోని చట్ట సభల్లో ఒక్క సభ్యుడు కూడా లేని స్తితికి బీఎస్పీ చేరుకుంది. 1989 తర్వాత బీఎస్పీకి ఈ పరిస్థితి ఇదే తొలిసారి. ఇక, ఉత్తరాఖండ్‌లో ఉన్న ఒక్క స్థానాన్ని బీజేపీ దక్కించుకోనుంది. ఆ పార్టీకి అసెంబ్లీలో భారీ మెజారిటీ ఉన్నందున ఆ రాజ్యసభ సీటు బీజేపీకే దక్కనుంది. పశ్చిమ బెంగాల్‌లో కూడా ఈ సీటును బీజేపీయే గెలుచుకోనుంది.

## నంది అవార్డులకు ఏపీ ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్.. 2012 నుంచి 2025 వరకు పురస్కారాలు ..

హైదరాబాద్, సెప్టెంబర్ 22: తెలుగు సినీ, టెలివిజన్ రంగాల కళాకారులకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక శుభవార్త అందించింది. ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న నంది అవార్డుల ప్రదానోత్సవాలకు ప్రభుత్వం అధికారికంగా అనుమతి ఇచ్చింది. 2012 నుంచి 2024 వరకు పెండింగ్‌లో ఉన్న నంది అవార్డులతో పాటు 2025 సంవత్సరానికి సంబంధించిన పురస్కారాలను కూడా నిర్వహించేందుకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు సాధారణ పరిపాలన శాఖ తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో చాలా కాలంగా ఎదురుచూస్తున్న నంది అవార్డుల పునరుద్ధరణకు మార్గం సుగమమైంది. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం 2012?2016 సంవత్సరాలకు సంబంధించిన నంది, జాతీయ చలనచిత్ర అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమాన్ని 2026 నవంబరులో విజయవాడలో నిర్వహించనున్నారు.ప్రపంచ పటాలు పరిశీలించండి

అదే సమయంలో 2017?2024, 2025 సంవత్సరాలకు సంబంధించిన నంది అవార్డుల ఎంపిక ప్రక్రియను కూడా పూర్తి చేయనున్నారు. 2017 నుంచి 2024 వరకు ప్రతి సంవత్సరానికి అన్ని విభాగాల్లో అవార్డులు ఇవ్వకుండా కొన్ని ప్రధాన విభాగాలకు మాత్రమే పురస్కారాలు అందజేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రతి ఏడాదికి మొదటి ఉత్తమ ఫీచర్ చిత్రం, రెండో ఉత్తమ ఫీచర్ చిత్రం, రెండు ప్రత్యేక జ్యూరీ అవార్డులు.. మొత్తంగా నాలుగు పురస్కారాలు ఇవ్వనున్నారు. టెలివిజన్ విభాగంలోనూ ఇదే తరహాలో 2017?2024 సంవత్సరాలకు ప్రతి ఏడాది మొదటి, రెండో ఉత్తమ మెగా సీరియల్‌తో పాటు రెండు ప్రత్యేక జ్యూరీ అవార్డులు అందించనున్నారు. అయితే 2025 సంవత్సరం నుంచి అన్ని విభాగాల్లోనూ నంది అవార్డులు అందజేయనున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది.

2017-2024, 2025 సంవత్సరాలకు సంబంధించిన నంది ఫిల్మ్ అవార్డుల ప్రదానోత్సవాన్ని 2026 డిసెంబరులో అమరావతి లేదా విజయవాడలో నిర్వహించనున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. నంది టెలివిజన్ అవార్డుల వేడుకను కూడా అదే నెలలో తిరుపతిలో నిర్వహించనున్నారు. దీంతో 2026 చివరి నాటికి పెండింగ్‌లో ఉన్న అవార్డుల ప్రక్రియను ముందుకు తీసుకెళ్లేలా ప్రభుత్వం షెడ్యూల్ రూపొందించింది. 2017?2024, 2025 సంవత్సరాలకు సంబంధించిన జ్యూరీ కమిటీల ఏర్పాటును పూర్తి చేసి, విజేతల ఎంపిక ప్రక్రియను నిర్వహించనున్నారు. అవార్డు గ్రహీతల జాబితాను నవంబరులో ప్రకటించేందుకు ప్రభుత్వం ప్రణాళిక రూపొందించింది. కాగా, ఇటీవలే నంది నాటక పురస్కారాలు?2025, కందుకూరి పురస్కారాలు?2026కు కూడా దరఖాస్తులను ఆహ్వానిస్తూ ప్రభుత్వం ప్రక్రియ ప్రారంభించిన విషయం తెలిసిందే.

## జూబ్లీహిల్స్ సీఐకి సుప్రీంకోర్టులో స్వల్ప ఊరట..

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 22: మహిళపై లైంగిక వేధింపుల ఆరోపణలతో సస్పెన్షన్ వేటు పడిన జూబ్లీహిల్స్ సీఐ శ్రీనివాసులు రెడ్డికి సుప్రీంకోర్టులో స్వల్ప ఊరట లభించింది. తదుపరి విచారణ వరకు శ్రీనివాసు రెడ్డిని అరెస్టు చేయవద్దని లేదా అతడిపై ఎలాంటి బలవంతపు చర్యలు తీసుకోవద్దని సుప్రీంకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది.

మంగళవారం ఈ కేసును జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ ఆర్ మహదేవన్‌తో కూడిన ధర్మాసనం విచారించింది. ఈ సందర్భంగా పై విధంగా హైదరాబాద్ నగర పోలీసులను ఆదేశించింది. అనంతరం ఈ కేసు విచారణను ధర్మాసనం వాయిదా వేసింది.

ఓ మహిళను జూబ్లీహిల్స్ మాజీ స్టేషన్ హౌస్ ఆఫీసర్, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు రెడ్డి లైంగికంగా వేధించాడు. అంతేకాకుండా ఆమెను బ్లాక్‌మెయిల్ చేసి బలవంతంగా అబార్షన్ చేయించాడంటూ తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో ఇటీవల అతడిపై ప్రభుత్వం సస్పెన్షన్ వేటు వేసింది. ఈ నేపథ్యంలో అతడు ముందస్తు బెయిల్ కోసం తెలంగాణ హైకోర్టును ఆశ్రయించాడు. అందుకు కోర్టు నిరాకరించింది. దీంతో తెలంగాణ హైకోర్టు తీర్పును సుప్రీంకోర్టులో సీఐ శ్రీనివాసులు రెడ్డి సవాల్ చేశారు.

## భారీ డాటా చార్జీల నుంచి రిలీఫ్.. తక్కువ ధరలో ప్లాన్స్ తీసుకురావాలన్న ట్రాయ్

న్యూ ఢిల్లీ, సెప్టెంబర్ 22:బేసిక్ ఫీచర్ ఫోన్లు వాడేవారికి గుడ్‌న్యూస్ అందించింది కేంద్ర ప్రభుత్వం. ఈ ఫోన్లు వాడేవారికి ఇక నుంచి తక్కువ ధరలో ప్లాన్స్ తీసుకురావాలని టెలికం కంపెనీలను ట్రాయ్ (టెలికాం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా) ఆదేశించింది.

టెలికాం కన్స్యూమర్ ప్రొటెక్షన్ (13వ అమెండ్‌మెంట్) రెగ్యులేషన్స్, 2026ను అనుసరించి మార్గదర్శకాలు జారీ చేసింది. దేశంలో ఇప్పటికీ కోట్ల మంది వినియోగదారులు బేసిక్, ఫీచర్ ఫోన్లు వాడుతున్నారు.

వీరిలో చాలా మందికి మొబైల్ ఇంటర్నెట్ వాడటం రాదు. అలాగే, ఎస్సెమ్మెస్‌లతో కూడా పెద్దగా పని ఉండదు. అయినప్పటికీ.. మొబైల్ రీచార్జ్ చేయాలంటే అన్నింటికీ కలిపి ఎక్కువ మొత్తం చెల్లించి రీచార్జ్ చేసుకోవాల్సిందే. కొన్నిసార్లు ఫీచర్ ఫోన్లు వాడే వారు కూడా మొబైల్ డాటాతో రీచార్జ్ చేసుకోవాల్సి వస్తుంది.

దీంతో చాలా మంది యూజర్లు తమకు అవసరం లేని వాటికి కూడా డబ్బులు చెల్లించాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలోనే ట్రాయ్ స్పందించింది.

ఈ అంశాన్ని గుర్తించిన ట్రాయ్.. ఫీచర్ ఫోన్ వినియోగదారులకు ఊరట కలిగించేలా నిర్ణయం తీసుకుంది. ఈ అంశంలో ఈ ఏడాది ఏప్రిల్ 7 నుంచి ప్రజల నుంచి వినతులు, సలహాలు తీసుకుంది.

జూన్ వరకు ప్రజల నుంచి వేలాది స్పందనలు వచ్చాయి. వీటన్నింటినీ పరిశీలించిన ట్రాయ్.. తాజాగా చట్టానికి సవరణలు చేస్తూ మార్గదర్శకాలు జారీ చేసింది. వినియోగదారులకు ఉపయోగపడేలా, తక్కువ ధరలో, వారి అవసరాలకు అనుగుణంగా ప్లాన్స్ ప్రవేశపెట్టాలని టెలికాం కంపెనీలను ఆదేశించింది.

డాటా లేకుండా కాల్స్ చేసుకునేందుకు, ఎస్ఎంఎస్‌ల కోసమే ప్లాన్స్ తీసుకురావాలని ఆదేశించింది. దీని ప్రకారం పలు ప్లాన్స్‌ను 30 రోజుల వ్యాలిడిటీతో తీసుకురావాలి. అలాగే, ప్రతి నెలా ఒకే తేదీ వరకు వ్యాలిడిటీ ఉండేలా ప్లాన్స్ రూపొందించాలి. దీంతో వినియోగదారులు తమకు ఏది అవసరమో దాని కోసం మాత్రమే చెల్లించుకునే అవకాశం ఉంటుంది.

## నోటీసులకు కారణం ఏంటి.. ఈసీకి సుప్రీం ప్రశ్న

న్యూ ఢిల్లీ, సెప్టెంబర్ 22: ఢిల్లీ సర్ ప్రక్రియలో భాగంగా లాజికల్ డిస్క్రిపెన్సీస్ కేటగిరీ కింద ఓటర్లకు జారీ చేస్తున్న నోటీసులపై సుప్రీం కోర్టు ఈసీపై పలు ప్రశ్నలు సంధించింది. ఏ ప్రాతిపదికన ఈ నోటీసులు జారీ చేస్తున్నారని ఈసీని ప్రశ్నించింది. ఈ కేటగిరీపై స్పష్టత ఇవ్వాలని చెప్పింది. సర్ నోటీసులపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ దాఖలైన పిటిషన్లపై వివరణ ఇవ్వాలని ఈసీని చీఫ్ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జాయ్‌మాలా బాగ్చీ, జస్టిస్ వి. మోహానలతో కూడిన ధర్మాసనం ఆదేశించింది.

ఢిల్లీ సర్ ప్రక్రియ జరుగుతున్న తీరుపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ పలు పిటిషన్లు దాఖలయ్యాయి. సర్ ప్రక్రియ కింద ఓటర్లకు జారీ చేస్తున్న నోటీసుల్లో స్పష్టమైన కారణాలు పేర్కొనట్లేదని పిటిషనర్ల తరఫు న్యాయవాది ప్రశాంత్ భూషన్ పేర్కొన్నారు. ఏ ప్రాతిపదికన ఓటర్లకు లాజికల్ డిస్క్రిపెన్సీ కేటగిరీ కింద నోటీసులు జారీ చేస్తున్నారని ప్రశ్నించారు. ఓటర్ల నుంచి ఏయే పత్రాలు, వివరాలను ఈసీ ఆశిస్తున్నదో కూడా స్పష్టత లేదని అన్నారు. సాధారణ ఓటర్ల వద్ద పరిమితమైన డాక్యుమెంట్స్ మాత్రమే ఉంటాయని చెప్పారు. చాలామంది దగ్గర ప్రాథమిక వివరాలున్న ప్రధాన డాక్యుమెంట్‌గా ఆదార్ కార్డు మాత్రమే ఉంటోందని చెప్పారు.

ఓటర్ నమోదు ప్రక్రియలో భాగంగా ప్రజలు అప్పటికే వయసు, నివాస ధ్రువీకరణ పత్రాలు సమర్పించిన నేపథ్యంలో మళ్లీ అదనపు వివరాల నిర్ధారణకు డాక్యుమెంట్స్ ఎందుకు సమర్పించాలని ప్రశ్నించారు. నివాసం మార్పు పేరిట ఇప్పటికే ముసాయిదా ఓటర్ల జాబితా నుంచి అనేక మంది పేర్లు తొలగించారని చెప్పారు. ఇందుకు అనుసరించిన పద్ధతిపై సందేహాలు లేవనెత్తారు.

ఈ విషయాలపై ఈసీ తరఫున సీనియర్ అడ్వొకేట్ డీఎస్ నాయుడు వాదనలు వినిపించారు. ప్రతి నోటీసుకు వెనక గల కారణాన్ని ఈసీ పేర్కొంటుందని ఆయన చెప్పారు. పిటిషనర్లు లెవనెత్తున్న అంశాలు వారు భావిస్తున్నంత తీవ్రమైనవి కావని అన్నారు. మరోవైపు సర్ ప్రక్రియ డెడ్‌లైన్‌ను అవసరమనుకుంటే పొడిగించేందుకు ఈసీ సుముఖంగానే ఉందని కూడా చెప్పారు. చట్టంలో పేర్కొన్న ప్రక్రియకు భిన్నంగా ఒక్కరి ఓటు కూడా తొలగించబోమని హామీ ఇచ్చారు. ఓటర్ల సహాయం కోసం ఇప్పటికే ప్రచార కార్యక్రమాలు, వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేశామని కూడా చెప్పారు.

## రాయపోల్ ఎంపీడీవోగా నరేందర్ రెడ్డి బాధ్యతలు స్వీకరణ

రాయపోల్ సెప్టెంబర్ 22 : సిద్దిపేట జిల్లా రాయపోల్ మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా (ఎంపీడీవో) నరేందర్ రెడ్డి మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..మండలంలో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేసేందుకు కృషి చేస్తానని నరేందర్ రెడ్డి తెలిపారు.

ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది, ప్రజల సహకారంతో మండలాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లేందుకు చర్యలు తీసుకుంటానని పేర్కొన్నారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అర్హులైన ప్రజలకు సక్రమంగా అందేలా సమన్వయంతో పనిచేస్తామని ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సంజ్ఞ భాషలతో చెవిటి వర్గాల సమ్మిళిత సుస్థిరాభివృద్ధి

## (23 సెప్టెంబర్ "అంతర్జాతీయ సంజ్ఞ లేదా సంకేత భాషల దినోత్సవం" సందర్భంగా)

సంజ్ఞ లేదా సంకేత భాష చెవిటి వారికి చదువు నేర్చుకోవడానికి, సమాచార వితరణకు, అభిప్రాయాలను వ్యక్తం చేయడానికి, మన ప్రత్యేకతను చాటు కోవడానికి, సమ్మిళిత అభివృద్ధికి మహా వరంగా మారింది. ప్రపంచవ్యాప్తంగా దాదాపు 300 వరకు "సంజ్ఞ భాషలు" లేదా "సైన్ లాంగ్వేజెస్" ఉన్నాయి. సంజ్ఞ భాషలకు ప్రత్యేక పదకోశం, విలక్షణ వ్యాకరణం ఉంటాయి. సంజ్ఞ భాషలకు ప్రధాన ఉదాహరణలుగా భారతీయ, అమెరికన్, బ్రిటీష్ సంకేత భాషలు వస్తాయి. సంజ్ఞ భాష వ్యక్తీకరణకు ముఖ కవళికలు, బాడీ లాంగ్వేజ్‌లు ప్రధానమైనవిగా గుర్తించబడ్డాయి. సంజ్ఞ భాషను నేర్చుకోవడం ద్వారా వినికిడి లోపం కలిగిన అభాగ్య దివ్యాంగుల సమస్యలు అర్థం చేసుకోవడంతో పాటు వారి పట్ల సహానుభూతి పెరుగుతుంది. ప్రపంచవ్యాప్తంగా దాదాపు 72 మిలియన్ల చెవిటి దివ్యాంగులు ఉన్నారు. సహజ సిద్ధమైన సంజ్ఞ భాషల పట్ల సాధారణ ప్రజల్లో అవగాహన చాలా తక్కువగా కనిపిస్తుంది. చెవిటి వారు ప్రజలతో మమేకం కావడం, ప్రయాణాలు చేయడం, విద్యాభ్యాసం, కమ్యూనికేషన్ చేయడం, సమావేశాలకు హాజరు కావడం లాంటి సందర్భాలకు సంకేత భాష ప్రయోగించబడుతుంది.

### వినికిడిలోపం కలిగిన దివ్యాంగులకు వరంగా సంజ్ఞ భాష:

చెవిటి తనకంతో బాధ పడుతున్న ప్రజలు ప్రజలతో మమేకం కావడానికి సంజ్ఞ భాష ఓ అద్భుత వరంగా మారింది. సంజ్ఞ భాష ప్రాధాన్యం గుర్తించిన ఐరాస 2017లో తీసుకున్న తీర్మానం ప్రకారం ప్రతి ఏట 23 సెప్టెంబర్ రోజున "అంతర్జాతీయ సంజ్ఞ భాష దినం (ఇంటర్నేషనల్ డే ఆఫ్ సైన్ లాంగ్వేజెస్)"ను పాటించడం జరుగుతున్నది. చెవిటి వ్యక్తులు, ముఖ్యంగా వినికిడిలోపం కలిగిన యువతకు సంజ్ఞ భాష ప్రాధాన్యం వివరిస్తూ, వారికి ఈ భాషను నేర్పడం విధిగా జరగాలి. స్థానిక స్థాయి నుంచి అంతర్జాతీయ స్థాయి వరకు చెవిటి ప్రజల సమస్యలను చర్చిస్తున్న వేదికల సమన్వయంతో సంజ్ఞ భాషను ఉపయోగించడం, అభివృద్ధి చేయడం, ప్రచారం చేయడం కొనసాగుతున్నది. వినికిడిలోపం కలిగిన ప్రజలను సాధారణ జనజీవన స్రవంతిలో కలిసి పోవడానికి సంజ్ఞ భాష ఉపకరిస్తున్నది. అంతర్జాతీయ సంజ్ఞ భాషల దినం-2026 ఇతివృత్తంగా "వినికిడి లోపం ఉన్న అభాగ్య దివ్యాంగుల మానవ హక్కులను పరిరక్షిద్దాం" అనబడే అంశాన్ని తీసుకొని ప్రచారం నిర్వహిస్తున్నారు. ఈ దినోత్సవ వేదికల్లో అవగాహన కలిపించడం, చెవిటి నిపుణుల ప్రసంగాలు ఏర్పాటు చేయడం, సంజ్ఞ భాష గుర్చి తెలుసుకోవడం, సైన్ లాంగ్వేజ్ క్లబ్బులు ఏర్పాటు చేయడం లాంటివి నిర్వహిస్తారు.

సాధారణ పౌర సమాజంతో చెవిటి వారిని అనుసంధానించడానికి సంజ్ఞ భాషలు చక్కగా ఉపయోగపడుతున్నాయి. మాటల్లో చెప్పలేని అద్భుత భావాలను సంజ్ఞలతో వ్యక్తం చేయడం ఓ అపురూప సందర్భం. సంజ్ఞ భాష ఒక కమ్యూనికేషన్ సాధనమే కాదు, అది రెండు హృదయాల కలయిక అవి తెలుసుకోవాలి. అందరితో సమానంగా విద్యను అభ్యసించడానికి సంజ్ఞ భాష దోహదపడుతున్నది. వినికిడా లోప దివ్యాంగుల మానవ హక్కుల పరిరక్షణలో సంజ్ఞ భాషలు సదా ఉపయోగపడుతున్నాయి. అన్ని అవయవాలు చక్కగా ఉన్న ప్రజలు సంజ్ఞ భాషలోని మౌలిక అంశాలను చేర్చుతొని, ఆ వర్గం ప్రజలతో సరదాగా మాట్లాడుదాం, మేం ఉన్నామన్న ధైర్యాన్ని అందిద్దాం.



-మధుపాళీ
9949700037

భారతీయ రైల్వేలో స్వచ్ఛతను పటిష్ఠంగా అమలు చేయడంతో పాటు

## అపరిష్కృత వ్యవహారాలను పరిష్కరించడానికి '6వ ప్రత్యేక ప్రచార ఉద్యమ' సన్నాహాలు

న్యూ ఢిల్లీ, సెప్టెంబర్ 22:ప్రభుత్వ కార్యాలయాల్లో స్వచ్ఛతను పటిష్ఠంగా అమలు చేయడంతో పాటు అపరిష్కృతంగా ఉన్న వ్యవహారాలను త్వరిత గతిన తగ్గించడానికి 6వ ప్రత్యేక ప్రచార ఉద్యమాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రారంభించింది. ఈ ఉద్యమంలో రెండు దశలు ఉన్నాయి. సన్నాహక దశను ఈ నెల 15 నుంచి 30 వరకూ చేపట్టి, లక్ష్యాలను నిర్ధారిస్తారు. ఆ తరువాత అక్టోబర్ 2 నుంచి 31 వరకూ రెండో దశ ఉంటుంది. ఇది ప్రధానంగా అమలుకు సంబంధించిన దశ.

ఇంతకు ముందు '5.0 ప్రచార ఉద్యమం'లో ప్రజల ఫిర్యాదులు, వీఐపీ వ్యవహారాలతో పాటు ఇతర అపరిష్కృత వ్యవహారాలను పరిష్కరించడానికి సంబంధించిన నిర్ధారిత లక్ష్యాలను రైల్వే శాఖ 100 శాతం సాధించి, కీలక ప్రగతిని నమోదు చేసింది. ఈ శాఖ సాధించిన ప్రధాన విజయాల్లో 6.06 లక్షల చదరపు అడుగుల జాగాను పునర్వినియోగానికి అనువైందిగా రూపొందించడమే కాకుండా రూ.570 కోట్ల ఆదాయాన్ని ఆర్జించడానికి రంగాన్ని సిద్ధం చేశారు.

రైల్వే శాఖ తన అన్ని క్షేత్రీయ విభాగాలు, అనుబంధ, సహాయక కార్యాలయాలు, ప్రభుత్వ రంగ సంస్థ (పీఎస్‌యూ)లు, స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన సంస్థల్లో పెండింగ్ వ్యవహారాలను పరిష్కరించడం కోసం 6వ ప్రత్యేక ప్రచార ఉద్యమాన్ని ఫలప్రదంగా అమలు చేయడానికి పూర్తి స్థాయిలో సన్నద్ధమైంది. ఈ ప్రచార ఉద్యమానికి అత్యున్నత ప్రాధాన్యాన్ని ఇవ్వడానికి అవసరమైన సన్నాహక చర్యలను రైల్వే బోర్డు ఎన్నో జాగ్రత్తలను తీసుకుని మరీ పర్యవేక్షిస్తున్నది. పాలనాపరమైన సంస్కరణలు, ప్రజా ఫిర్యాదుల విభాగం (డీఏఆర్‌పీజీ) తరఫున విస్తృత మార్గదర్శకాలను అన్ని క్షేత్ర విభాగాలకు పంపించారు. పనులు చేసే సిబ్బందిని సమీకరించడం, ప్రచార ఉద్యమ స్థలాలను గుర్తించడం, ఏయే ప్రాంతాల్లో ప్రచార ఉద్యమాన్ని నిర్వహించాలో ఎంపిక చేయడం, స్థల నిర్వహణకు సంబంధించిన ప్రణాళికను సిద్ధం చేయడం వంటి పనులను పురమాయించారు. ఈ విషయంలో జనరల్ మేనేజర్లకు, ఇతర యూనిట్ల అధిపతులకు రైల్వే బోర్డు కార్యదర్శి ఒక డెమీ అఫీషియల్ (డి.ఒ.) లేఖను కూడా పంపారు.

విస్తృత స్థాయిలో భాగస్వామ్యం లభించేటట్లు చూడడానికి అన్ని జోనల్ రైల్వేలు, డివిజనల్ కార్యాలయాలు, పీఎస్‌యూలు, నిర్మాణ యూనిట్లకు సమగ్ర ఆదేశాలను జారీ చేశారు. ఈ ప్రయత్నాన్ని సమన్వయ పరిచేందుకు భారతీయ రైల్వేకు చెందిన 150 కన్న ఎక్కువ మంది నోడల్ అధికారులను నామినేట్ చేశారు. వీరు రోజువారీ పురోగతికి సంబంధించిన సమాచారాన్ని సేకరించి రైల్వే బోర్డుకు పంపుతారు. దీంతో ఈ సమాచారాన్ని నేరుగా డీఏఆర్‌పీజీకి చెందిన అధికారిక డిజిటల్ పర్యవేక్షణ ప్రధాన వేదికైన కేంద్ర ఎస్‌సీడీపీఎమ్ (స్పెషల్ క్యాంపెయిన్ ఫర్ డిస్పోజల్ ఆఫ్ పెండింగ్ మ్యాటర్స్)లో నమోదు చేయడానికి బోర్డుకు అవకాశం కలుగుతుంది. ఫలితంగా వాస్తవిక సమయంలో పర్యవేక్షణ, వారం వారీ ఉన్నత స్థాయి సమీక్షకు మార్గం సుగమం అవుతుంది.

ప్రస్తుతం సన్నాహక దశ పురోగమిస్తున్న కారణంగా, ప్రచార ఉద్యమానికి సంబంధించిన ప్రమాణాల విషయంలో లక్ష్యాలకు తుది రూపురేఖలు తీర్చిదిద్దుతున్నారు. ఈ సంవత్సరం నిర్దేశించుకున్న ప్రాధాన్యాలకు అనుగుణంగా, '2022 ఎలక్ట్రానిక్ వ్యర్థాల (ఈ-వేస్ట్) నియమావళి'లో ప్రస్తావించిన "ఈ-వ్యర్థాలను ప్రభావవంతంగా సేకరించడం, వేరు చేయడం, తొలగించడం", జనరల్ ఫైనాన్షియల్ రూల్స్ (జీఎఫ్ఆర్) పరిధిలో చెత్త తొలగింపు, కార్యాలయ పరిసరాల సుందరీకరణ, ప్రక్రియలు, నియమాల సరళీకరణతో పాటు పెండింగ్ వ్యవహారాల పరిష్కారం విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకొంటారు.

రైల్ చౌపాల్ (ఎస్‌సీడీపీఎమ్ 4.0), అమృత్ సంవాద్ (ఎస్‌సీడీపీఎమ్ 5.0)లను విజయవంతంగా నిర్వహించిన తరువాత, రైల్వే మంత్రిత్వశాఖ 6వ ఎస్‌సీడీపీఎమ్‌లో భాగంగా "రైల్ జన్ సంవాద్" ను నిర్వహించనుంది. ప్రజల భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడంతో పాటు, పౌరులతో అర్థవంత చర్చను ప్రోత్సహించాలన్న ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని అమలు చేయనున్నారు.

రోజువారీ కార్యకలాపాల్లో స్వచ్ఛతకు ప్రాధాన్యాన్ని ఇవ్వాలన్న తన నిబద్ధతను రైల్వే బోర్డు శాఖ పునరుద్ఘాటిస్తున్నది. ప్రజా సంబంధాలను ఇదివరకటి కన్న నిరంతరాయంగా మెరుగుపరుచుకోవడానికి ఈ మంత్రిత్వ శాఖ కట్టుబడి ఉంది. పరిష్కారం కాకుండా మిగిలిపోయిన వ్యవహారాలను సత్వర గతిన పరిష్కరించడానికి ప్రాధాన్యాన్ని కొనసాగించనుంది. సమన్వయ పూర్వక పథక రచన, అన్ని యూనిట్లలోనూ అంకిత భావంతో కూడిన భాగస్వామ్యం ద్వారా రైల్వే శాఖ 6వ ప్రత్యేక ప్రచార ఉద్యమాన్ని ఇదివరకు ఎన్నడూ ఎరుగనంత స్థాయిలో విజయవంతం చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకుంది.

## కడెం ఇంగ్లీష్ టీచర్ డిప్యూటేషన్ రద్దు చేయాలి



ఆదిలాబాద్, సెప్టెంబర్ 22:కడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లీష్ ఉపాధ్యాయుడు చిలివేరి వెంకట్‌రాములు డిప్యూటేషన్‌ను రద్దు చేయాలని కోరుతూ పాఠశాల పోషక కమిటీ సభ్యులు, పోషకులు, గ్రామస్తులు ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జును కలిసి వినతిపత్రం అందజేశారు. కడెం పాఠశాలలో 402 మంది విద్యార్థులు ఉండగా, ఇంగ్లీష్ ఉపాధ్యాయుడు వెంకట్‌రాములను వర్క్ అడ్జస్ట్‌మెంట్ కింద మండలంలోని మద్దిపడగ జడ్పీ ఉన్నత పాఠశాలకు డిప్యూటేషన్‌పై పంపించారని తెలిపారు. మద్దిపడగ పాఠశాలలో 58 మంది విద్యార్థులు మాత్రమే ఉన్నారని పేర్కొన్నారు. ఇప్పటికే కడెం పాఠశాలకు చెందిన సోషల్, ఇంగ్లీష్, బయలాజికల్ సైన్స్, ఫిజికల్ సైన్స్ సబ్జెక్టుల నలుగురు ఉపాధ్యాయులను ఇతర మండలాల పాఠశాలలకు డిప్యూటేషన్‌పై పంపించారని తెలిపారు. 11 సెక్షన్లు ఉన్న పాఠశాలలో ఉపాధ్యాయుల సంఖ్య తగ్గడంతో బోధనకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని వివరించారు. వెంకట్‌రాములు పదో తరగతితో పాటు ఓపెన్ స్కూల్ బాధ్యతలు కూడా నిర్వహిస్తున్నారని, అంకితభావంతో పనిచేస్తున్న ఆయనను తిరిగి కడెం పాఠశాలలోనే కొనసాగించాలని కోరారు.

వినతిపై స్పందించిన ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు నిర్మల్ డీఈఓ ఆశన్నతో ఫోన్‌లో మాట్లాడి వెంకట్‌రాములు డిప్యూటేషన్‌ను వెంటనే నిలుపుదల చేయాలని ఆదేశించారు. కడెం జడ్పీ ఉన్నత పాఠశాలలో 402 మంది విద్యార్థులు ఉన్నందున ఇంగ్లీష్ బోధనకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని, ఉపాధ్యాయుడి డిప్యూటేషన్‌ను రద్దు చేసి యథావిధిగా కడెం పాఠశాలలో విధులు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని డీఈఓను కోరారు. కార్యక్రమంలో కడెం ఎంఈఓ శ్రీనివాసరెడ్డి, పాఠశాల పోషక కమిటీ సభ్యులు, పోషకులు, గ్రామస్తులు, కాంగ్రెస్ నాయకులు బుర్ర దేవేందర్‌గౌడ్, చిట్యాల చిన్నయ్య, సయ్యద్ వసీయుద్దీన్, తక్కల్ల సత్తన్న, కోల గంగయ్య, షేక్ నయీమ్ తదితరులు పాల్గొన్నారు.

## 'గర్భిణులు, పిల్లలు పోషకాహారం తీసుకోవాలి'

### నల్లగొండ 47వ డివిజన్ కార్పోరేటర్ అబ్బగోని కవితా రమేష్

నల్గొండ, సెప్టెంబర్ 22: గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పోషక విలువలతో కూడిన సమతుల్య ఆహారాన్ని తీసుకోవాలని, తద్వారా రక్తహీనతను నివారించి, ఆరోగ్య వంతమైన సమాజాన్ని నిర్మించవచ్చని నల్లగొండ 47వ డివిజన్ కార్పోరేటర్ అబ్బగోని కవితా రమేష్ అన్నారు. జాతీయ పోషణ మాసం ఉత్సవాల్లో భాగంగా గొల్లగూడ సెక్టార్ పరిధిలోని బొయవాడ అంగన్‌వాడీ కేంద్ర ంలో మంగళవారం పోషకాహార అవగాహన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పంపిణీ చేస్తున్న పౌష్టికాహారాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోషణ్ అభియాన్ జిల్లా కోఆర్డినేటర్ సతీష్, సూపర్‌వైజర్ జి.సరస్వతి, అంగన్‌వాడీ టీచర్లు భారతి, ఆర్పీ, ఆశా వర్కర్లు, గ్రామ మహిళలు, గర్భిణులు, బాలింతలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పోషణమాసం కార్యక్రమంలో భాగంగా మంగళవారం చర్లపల్లి సెక్టార్ పరిధిలోని శివాజీనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో పోషణమాసం కార్యక్రమం నిర్వహించారు.

## సౌలభ్య నియంత్రిత హైస్పీడ్ జాతీయ రహదారుల ప్రణాళికల రూపకల్పన...

## నిర్మాణంపై 'ఎన్‌హెచ్‌ఏఐ' కొత్త మార్గదర్శకాలు

న్యూ ఢిల్లీ, సెప్టెంబర్ 22:దేశవ్యాప్తంగా 'ఎక్స్‌ప్రెస్‌వే'లు మినహా సౌలభ్య నియంత్రిత హైస్పీడ్ జాతీయ రహదారుల ప్రణాళికల రూపకల్పన, నిర్మాణంపై 'ఎన్‌హెచ్‌ఏఐ' కొత్త సమగ్ర మార్గదర్శకాలు జారీచేసింది. 'వికసిత భారత్-2047' సంకల్ప సాకారంతోపాటు అంతర్జాతీయ ప్రమాణాలతో జాతీయ రహదారుల నెట్‌వర్క్ నిర్మాణంపై కేంద్ర ప్రభుత్వ దీర్ఘకాలిక లక్ష్యం మేరకు వీటిని రూపొందించింది.

హైస్పీడ్ జాతీయ రహదారి కారిడార్ల సమగ్ర ప్రాజెక్టు నివేదికల (డీపీఆర్) తయారీ ప్రమాణాలలో ఏకరూపత, సాంకేతిక ప్రమాణాలలో మరింత స్థిరత్వం, రహదారి భద్రత బలోపేతం, జాతీయ రహదారులన్నిటా కార్యాచరణ సామర్థ్యం మెరుగుదల ఈ మార్గదర్శకాల లక్ష్యం. భవిష్యత్తులో నిర్మించే అన్ని 4, 6 వరుసల కొత్త జాతీయ రహదారులు సహా నవీకృత సౌలభ్య నియంత్రిత హైస్పీడ్ కారిడార్లకూ ఇవి వర్తిస్తాయి.

కేంద్ర ప్రభుత్వ దీర్ఘకాలిక వ్యూహాత్మక భవిష్యత్ ప్రణాళికకు అనుగుణంగా ఈ మార్గదర్శకాలు రూపొందాయి. వికసిత భారత్-2047 కింద 50,000 కిలోమీటర్ల సౌలభ్య నియంత్రిత హైస్పీడ్ కారిడార్ల నిర్మాణంపై ప్రభుత్వం లక్ష్యనిర్దేశం చేసుకుంది. తద్వారా దేశవ్యాప్తంగా అనుసంధానం విస్తరించి, రవాణా వ్యయం గణనీయంగా తగ్గుతుంది.

ప్రస్తుతం 'ఎక్స్‌ప్రెస్‌వే'లు మినహా సౌలభ్య నియంత్రిత హైస్పీడ్ జాతీయ రహదారుల ప్రణాళిక రూపకల్పనను నియంత్రించే ప్రత్యేక ప్రమాణాలు-నిర్దేశాలేవీ లేవు. ప్రస్తుతం అనుసరిస్తున్న 'డీపీఆర్' తయారీ ప్రమాణాల్లో అనేక లోటుపాట్లను 'ఎన్‌హెచ్‌ఏఐ' గమనించింది. ఈ నేపథ్యంలో జారీ అయిన కొత్త మార్గదర్శకాలు ఏకరూప సాంకేతిక, భద్రత నిబంధనల నిర్దేశం ద్వారా ప్రమాణాలను మెరుగుపరుస్తాయి.

ఈ కారిడార్లపై వాహనాలు వేగంగా ప్రయాణిస్తాయి కాబట్టి, తదనుగుణ అదనపు భద్రత చర్యలను నిర్దేశించడం కొత్త మార్గదర్శకాల ధ్యేయం. ఆ మేరకు నిష్క్రమణ-ప్రవేశ మార్గాలపై ముందస్తు సమాచారం వెల్లడికి ప్రత్యేక నిబంధనలను ఇవి సూచిస్తాయి. జాతీయ రహదారిపై ప్రయాణంలో ఎక్కడెక్కడ ప్రవేశ-నిష్క్రమణ ప్రదేశాలు ఉంటాయో ముందుగానే తెలియడం ద్వారా సురక్షిత ప్రయాణం సాధ్యమవుతుంది.

వాహన రాకపోకల సమగ్ర అంచనా ప్రాతిపదికగా హైస్పీడ్ జాతీయ రహదారిలో వరుసల అమరికను ప్రామాణీకరిస్తారు. అంటే- 15,000 వాహనాల దాకా రద్దీగల 4 వరుసల హైవేలు, కారిడార్లు ఇకపై 60 మీటర్ల వెడల్పుతో ఉంటాయి. ఇక 15,000-25,000 మధ్య వాహన రాకపోకలుగల 4 వరుసల, 6 వరసల కారిడార్ల వెడల్పు 70 మీటర్ల దాకా ఉంటుంది. దీంతోపాటు 25,000-40,000 వాహన రాకపోకలు గల 6 వరుసల జాతీయ రహదారి కూడా 70 మీటర్ల వెడల్పు ఉంటుంది.

ఎక్స్‌ప్రెస్‌వేలు, జాతీయ-రాష్ట్ర రహదారులలో గణనీయ వాహన రాకపోకలకు కారణమైన కీలక ఆర్టీరియల్ రోడ్లు సహా ఓడరేవులు, విమానాశ్రయాలు, బహుళ వాహన రవాణా పార్కులు (ఎంఎంపీఎల్), పారిశ్రామిక ప్రాంతాలు, ప్రధాన పర్యాటక ప్రదేశాల్లో ప్రధాన వాహన రద్దీ ప్రాంతాలను సంధానించే రోడ్డు కూడళ్ల వద్ద వాహనాలు దాటేందుకు ర్యాంపులు ఏర్పాటు చేస్తారు.

ప్రవేశ నియంత్రణ బలోపేతం, ఆక్రమణలు-అనధికార ప్రవేశం సహా హైస్పీడ్ కారిడార్లలో పశువుల నిరోధం కోసం వెలుపలి అంచు వెంబడి ఒక మీటర్ ఎత్తుగల ప్రహరీ నిర్మించాలని మార్గదర్శకాలు నిర్దేశిస్తున్నాయి. ఈ మేరకు పూర్తి ప్రవేశ నియంత్రణ గల జాతీయ రహదారుల ప్రణాళిక-నిర్మాణాల ప్రామాణీకరణ సహా హైస్పీడ్ జాతీయ రహదారి ప్రాజెక్టులన్నింటా ఏకరూపతను నిర్దేశించే ఈ మార్గదర్శకాలను ఒక ప్రగతిశీల చర్యగా పరిగణించాల్సి ఉంటుంది.

[illegible], నిరాటంక-నిరంతరాయ భవిష్యత్ సంసిద్ధ జాతీయ రహదారి నెట్‌వర్క్ రూపకల్పనపై 'ఎన్‌హెచ్‌ఏఐ' నిబద్ధతను బలపరిచే ఈ మార్గదర్శకాలు, మరోవైపు 'వికసిత భారత్-2047'పై కేంద్ర ప్రభుత్వ స్వప్న సాకారానికీ దోహదం చేస్తాయి.

## భక్తిశ్రద్ధలతో నిమజ్జన ఉత్సవాలు

### శాంతియుతంగా శోభాయాత్ర లు నిర్వహించాలి

### ఏర్పాట్లను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్, ఎస్పీ అశోక్ కుమార్

కరీంనగర్, సెప్టెంబర్ 22: భక్తిశ్రద్ధలతో ధర్మపురి పట్టణంలో వినాయక నిమజ్జన వేడుకలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ తెలిపారు. పట్టణంలోని గోదావరి నది, రాయపట్నం గోదావరి నది వద్ద వినాయక నిమజ్జన వేడుకల కోసం మున్సిపల్, పోలీస్, రెవెన్యూ, అగ్నిమాపక ఇతర శాఖల ఆధ్వర్యంలో చేస్తున్న ఏర్పాట్లను మంగళవారం జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్, ఎస్పీ అశోక్ కుమార్ లతో కలిసి పరిశీలించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. నిమజ్జన ఉత్సవాలకు నిర్వాహకులు అధికారులకు పూర్తి స్థాయిలో సహకరించాలని ఎటువంటి సంఘటనలు జరగకుండా శోభయాత్ర, నిమజ్జనం వేడుకలు చేసుకోవాలని కోరారు. అన్ని శాఖల అధికా రులు సమన్వయంతో పక్కా ప్రణాళికతో వేడుకలను విజయవంతం చేయాలని ఆదేశించారు. వినాయక నిమజ్జనానికి కావలసిన, స్టేజ్, విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని, వైద్య సేవలు, అగ్ని మాపక శాఖ, మత్స్యశాఖ, అధికారులు సేవలు అందించాలని, నిమజ్జన ప్రదేశాల్లో పారిశుధ్య పనులు చేయించాలని, భారీ క్రేన్లు, చిన్నక్రెన్‌లు, గజ ఈతగాళ్ళు అవసరం మేరకు అందుబాటులో ఉంచుకోవాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్డీఓ మధుసూదన్, మున్సిపల్ చైర్మన్ నాగలక్ష్మి, డిఎస్పీ పురుషోత్తం రెడ్డి, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, తహసీల్దార్ శ్రీనివాస్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ తోనే కార్మికుల సంక్షేమం

### రూ.800 కోట్లతో రామగుండంలో అభివృద్ధి

### బిఆర్ఎస్ పాలనలో సింగరేణికి నష్టం

### నగర మేయర్ మహంకాళి స్వామి



కరీంనగర్, సెప్టెంబర్ 22: సింగరేణి బొగ్గు గని కార్మికుల సంక్షేమం కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమవుతుందని రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి తెలిపారు. మంగళవారం విలేకరుల సమావేశంలో మహంకాళి స్వామి మాట్లాడుతూ.. రామగుండంలో సింగరేణికి చెందిన రూ. 105 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. దివంగత నేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో గోదావరిఖనిలోనే 17వేల పట్టాలు ఇచ్చామని, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ కూడా ఇవే పట్టాలు పొందారన్నవిషయాన్నిగుర్తు చేశారు.

సింగరేణి ప్రాంతంలో అతి త్వరలో వేలాది మందికి పట్టాలు రాబోతున్నాయని పేర్కొన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఎంతమందికి సింగరేణి ప్రాంతంలో పట్టాలిచ్చారో చెప్పాలని ప్రశ్నించారు. 10 సంవత్సరాల పాలన చేసి బీఆర్ఎస్ సింగరేణిలో ఏం అభివృద్ధి చేసిందో చెప్పాలని, మూడు సంవత్సరాల కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఎంత అభివృద్ధి చేసింది నిరూపిస్తామని డిప్యూటీ మేయర్ పాతిపల్లి ఎల్లయ్య స్పష్టం చేశారు. చేతనైతే బీఆర్ఎస్ నేతలు ప్రజాకోర్టుకు రావాలని సవాల్ విసిరారు. సీనియర్ నాయకులు బొంతల రాజేష్ మాట్లాడుతూ.. గోదావరిఖనిలో కొత్తగా నిర్మాణం చేస్తున్న షాపింగ్ కాంప్లెక్స్‌లో షాపులు కోల్పోయిన బాధితులకు మొదట ఇస్తామన్నారు. ఇండ్లు కోల్పోయిన వారికి తగిన న్యాయం చేస్తామన్నారు. రామగుండంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక ఎలా పడితే అలా మాట్లాడితే ఊరుకోమన్నారు. మాజీ మంత్రి, మాజీ ఎమ్మెల్యే అవగాహన లేకుండా మాట్లాడడం సరి కాదన్నారు. సమావేశంలో నాయకులు బొంతల రాజేష్, రవికుమార్, నెలకంటి రాము, తిప్పారపు శ్రీనివాస్, అనుమ సత్యనారాయణ,దూళికట్ట సతీష్, దాసరి విజయ్ తదితరులు పాల్గొన్నారు

## పాదం నొప్పిని నిర్లక్ష్యం చేయొద్దు

### ఆధునిక చికిత్సతో శాశ్వత పరిష్కారం

కరీంనగర్, సెప్టెంబర్ 22:పాదం, మడమ సమస్యలు సాధారణమైనవే అయినప్పటికీ చాలా మంది నొప్పి తీవ్రత పెరిగే వరకు నిర్లక్ష్యం చేస్తున్నారని డాక్టర్ ఆదిత్య సోమాయజీ అన్నారు. మంగళవారం జగిత్యాల ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మడమ నొప్పి, తరచూ బెణకడం, పాదం ఆకృతి మారడం, క్రీడల సమయంలో గాయాలు, మధుమేహం కారణంగా వచ్చే పాద సమస్యలను వయసు కారణంగా వచ్చినవిగా భావించి వదిలేయకూడదన్నారు. ప్రారంభ దశలోనే వైద్యులను సంప్రదిస్తే పెద్ద సమస్యలను నివారించడంతో పాటు శాశ్వత వైకల్యాన్ని అడ్డుకోవచ్చని తెలిపారు.

# పుష్కరాల అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

## నూతన తీర్థాలు, రహదారి నిర్మాణాలపై అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్ పరిశీలన



కరీంనగర్, సెప్టెంబర్ 22:పుష్కరాల ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకుని ప్రతిపాదించిన నూతన తీర్థాల అభివృద్ధి పనులతో పాటు భక్తులకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించేందుకు చేపట్టాల్సిన రహదారి నిర్మాణ పనులను వేగవంతం చేయాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్ అధికారులను ఆదేశించారు. బుధవారం సిరోంచ?కాటారం ప్రాంతంలో క్షేత్రస్థాయిలో పర్యటించిన ఆయన వివిధ అభివృద్ధి పనులను పరిశీలించారు.

సిరోంచ వంతెన నుంచి ప్రధాన ఘాట్ వరకు సుమారు రెండు కిలోమీటర్లు, సరస్వతీ ఘాట్ నుంచి పక్షి తీర్థం వరకు 0.8 కిలోమీటర్ల పరిధిలో నూతనంగా ఏర్పాటు చేయనున్న ఐదు తీర్థాల ప్రతిపాదిత స్థలాలను అదనపు కలెక్టర్ పరిశీలించారు. ఆయా ప్రాంతాల్లో భక్తులకు అవసరమైన మౌలిక వసతులు, రహదారి సౌకర్యాలపై అధికారులతో చర్చించారు. అనంతరం ఆది ముక్తేశ్వర దేవాలయం నుంచి సరస్వతీ ఘాట్ వరకు భూసేకరణ పూర్తయిన శాశ్వత రహదారి నిర్మాణ స్థలాన్ని పరిశీలించారు. పనులను వేగవంతం చేసి, నిర్దేశిత ప్రణాళిక ప్రకారం పూర్తి చేయాలని ఆదేశించారు.

సిరోంచ వంతెన సమీపంలో వినాయక విగ్రహాల నిమజ్జనం కోసం కేటాయించిన ప్రాంతాన్ని కూడా అదనపు కలెక్టర్ పరిశీలించారు. నిమజ్జనానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన భద్రతా చర్యలు చేపట్టడంతో పాటు మౌలిక సదుపాయాలు కల్పించాలని అధికారులకు సూచించారు. అనంతరం కన్నెపల్లి గ్రామంలో కొనసాగుతున్న భూముల రీసర్వే ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సర్వే పనులను పారదర్శకంగా, వేగవంతంగా నిర్వహించి నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. పర్యటనలో తహసీల్దార్ సత్యనారాయణస్వామి, మండల సర్వేయర్‌తో పాటు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# 'స్వచ్ఛ సాగర్ సురక్షిత్ సాగర్ 5.0'కి వచ్చిన భారీ జనస్పందన పట్ల హర్షం వ్యక్తం చేసిన డాక్టర్ జితేంద్ర సింగ్

న్యూ ఢిల్లీ, సెప్టెంబర్ 22:శాస్త్ర విజ్ఞానానికి సంబంధించిన మంత్రిత్వ శాఖలు, విభాగాల మధ్య బలమైన సమన్వయం ఉండాలని.. నగరాల వారీగా శాస్త్రీయ క్లస్టర్లను అభివృద్ధి చేయాలని, భారత శాస్త్రీయ విజయాలను మరింత విస్తృతంగా ప్రజలకు చేరువ చేయాలని కేంద్ర శాస్త్ర-సాంకేతిక, భూవిజ్ఞాన శాఖ సహాయ మంత్రి(స్వతంత్ర బాధ్యత).. ప్రధాని కార్యాలయం, సిబ్బంది-ప్రజా ఫిర్యాదులు-పింఛన్లు, అణుశక్తి, అంతరిక్ష శాఖల సహాయ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ ఈ రోజు పిలుపునిచ్చారు.

ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొన్న ఇటీవలి 'స్వచ్ఛ సాగర్ సురక్షిత్ సాగర్' 5.0ను కూడా కేంద్ర మంత్రి సమీక్షించారు. 2026 సెప్టెంబర్ 12 నుంచి 19 వరకు నిర్వహించిన ఈ తీర ప్రాంత స్వచ్ఛతా కార్యక్రమాన్ని 13 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల పరిధిలోని 231 చోట్ల చేపట్టారు. ఇందులో 15 లక్షల మంది ప్రజలు సముద్ర పరిరక్షణ ప్రతిజ్ఞ చేశారు.

డాక్టర్ జితేంద్ర సింగ్ అధ్యక్షతన జరిగిన శాస్త్ర సాంకేతిక మంత్రిత్వ శాఖలు, విభాగాల నెలవారీ సమీక్ష సమావేశానికి కేంద్ర ప్రభుత్వ ఖప్రధాన శాస్త్రీయ సలహాదారు ప్రొఫెసర్ అజయ్ కుమార్ సూద్, బయోటెక్నాలజీ విభాగం కార్యదర్శి డాక్టర్ రాజేష్ గోఖలే, శాస్త్ర సాంకేతిక విభాగం కార్యదర్శి ప్రొఫెసర్ ఉమేష్ వీ. వాఘ్‌మారే, శాస్త్రీయ-పారిశ్రామిక పరిశోధన విభాగం కార్యదర్శి ప్రొఫెసర్ ఎన్. కలైసెల్వి, భూవిజ్ఞాన మంత్రిత్వ శాఖ కార్యదర్శి డాక్టర్ టీ. శ్రీనివాస కుమార్, అనుసంధాన్ నేషనల్ రీసెర్చ్ ఫౌండేషన్ (ఏఎన్‌ఆర్‌ఎఫ్) సీఈఓ డాక్టర్ శివకుమార్ కల్యాణరామన్ తదితరులు హాజరయ్యారు. వీరితో పాటు సంబంధిత మంత్రిత్వ శాఖలు, విభాగాలు, శాస్త్రీయ సంస్థల సీనియర్ అధికారులు కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు.

భారత్‌లోని శాస్త్రీయ సంస్థలు మరింత సమన్వయంతో ప్రజలకు స్పష్టంగా కనిపించే రీతిలో పనిచేయాలని డాక్టర్ జితేంద్ర సింగ్ చెప్పారు. సంబంధిత రంగాల్లో పనిచేస్తున్న సంస్థలు, భాగస్వాములను ఒకచోట చేర్చడంలో నగరాల వారీగా ఏర్పాటు చేసే శాస్త్రీయ క్లస్టర్లు ఎంతగానో దోహదపడతాయని ఆయన పేర్కొన్నారు. ప్రయోగశాలలు, సంస్థల నుంచి వస్తున్న ముఖ్యమైన పురోగతులు సమాజంలోని విస్తృత వర్గాలకు చేరేలా కొత్త, ప్రభావవంతమైన శాస్త్రీయ విజయాలను నిరంతరం గుర్తించటం, ప్రదర్శించటం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

శాస్త్ర సాంకేతిక, ఆవిష్కరణ రంగాల్లో సాధించిన ముఖ్యమైన విజయాలు సకాలంలో, సులభంగా అర్థమయ్యే రీతిలో, ఆకర్షణీయమైన పద్ధతిలో ప్రజలకు చేరేలా శాస్త్ర విజ్ఞాన మంత్రిత్వ శాఖలు, విభాగాల మధ్య సమాచార వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని కేంద్ర మంత్రి పిలుపునిచ్చారు. శాస్త్రీయ విజయాలను సంస్థలకే పరిమితం చేయకుండా భారత శాస్త్రీయ వ్యవస్థకు, ప్రజలకు మధ్య బలమైన అనుబంధాన్ని ఏర్పరచడంపై ఆయన ప్రత్యేక దృష్టి సారించారు.

భారత శాస్త్రీయ సంస్థల కృషిని తెలియజేసే వీడియోలు, ఇతర కమ్యూనికేషన్‌ల ఉమ్మడి రిపాజిటరీగా ప్రతిపాదించిన 'డిజిటల్ లైబ్రరీ ఆఫ్ సైంటిఫిక్ అచీవ్‌మెంట్స్' పురోగతిని ఈ సందర్భంగా ఆయన సమీక్షించారు. డిజిటల్ లైబ్రరీ కోసం సంస్థాగత విధానాన్ని, అమలు పద్ధతులను అభివృద్ధి చేయడంలో సీఎస్ఐఆర్-ఎన్ఐఎస్‌సీపీఆర్ నోడల్ సంస్థగా పనిచేస్తోంది. సంబంధిత మంత్రిత్వ శాఖలు, విభాగాల మధ్య భాగస్వామ్యం, వనరుల సమీకరణకు సంబంధించిన విధివిధానాలు ప్రస్తుతం రూపుదిద్దుకుంటున్నాయి.

ముఖ్యమైన శాస్త్రీయ, సాంకేతిక విజయాలను ప్రధానంగా తెలియజేసే తక్కువ నిడివి గల కంటెంట్ సృష్టి, ప్రసారంతో సహా డీఎస్టీ, డీబీటీ, డీఎస్ఐఆర్ లేదా సీఎస్ఐఆర్, ఎంఓఈఎస్‌లు ప్రస్తుతం చేపడుతోన్న డిజిటల్ అవగాహన కార్యక్రమాలను కూడా ఆయన ఈ సందర్భంగా పరిశీలించారు. శాస్త్రీయ సంస్థల పనులకు మరింత విస్తృతమైన గుర్తింపును తెచ్చిపెట్టడం, ముఖ్యమైన పరిణామాలు కేవలం శాస్త్రీయ వర్గాలకే పరిమితం కాకుండా విస్తృత సమాజానికి చేరేలా చూడటమే ఈ సమన్వయ విధానానికి ఉన్న ముఖ్య ఉద్దేశం.

ప్రజా భాగస్వామ్యాన్ని ఇదే స్థాయిలో కొనసాగించాలన్న కేంద్ర మంత్రి.. శాస్త్రీయ అవగాహన, పర్యావరణ బాధ్యత, ప్రజా భాగస్వామ్యం మధ్య బంధాన్ని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. పరిశుభ్రమైన తీరప్రాంతాలు, సురక్షితమైన సముద్రాల కోసం చేపట్టిన ఈ దేశవ్యాప్త కార్యక్రమంలో ప్రజలు, విద్యార్థులు, తీర ప్రాంత ప్రజలు, ప్రభుత్వ శాఖలు, శాస్త్రీయ సంస్థలు, వాలంటీర్లు అందరూ భాగస్వాములయ్యారు.

దేశంలో స్వయంప్రతిపత్తి కలిగిన శాస్త్రీయ సంస్థల కృషిని ప్రజలకు తెలియజేయటానికి, వాటి విజయాలను విస్తృత జనబాహుళ్యానికి చేరవేయడానికి శాస్త్ర, సాంకేతిక విభాగం (డీఎస్టీ) ప్రారంభించిన నెలవారీ ఉపన్యాస వేదిక 'విజ్ఞాన్ కీ బాత్' పురోగతిని కూడా ఇందులో సమీక్షించారు. ఈ నెల 26న జరగనున్న రెండో ఎడిషన్‌లో ఎస్.ఎన్. బోస్ నేషనల్ సెంటర్ ఫర్ బేసిక్ సైన్సెస్ డైరెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొంటారు. ఈ సెషన్‌లో ఫౌండేషనల్ భౌతిక శాస్త్రాలు, క్వాంటం సాంకేతికత రంగంలో సాధించిన పురోగతిపై ప్రత్యేకంగా చర్చిస్తారు.

2026 ఆగస్టు 29న నిర్వహించిన 'విజ్ఞాన్ కీ బాత్' ప్రారంభ ఎడిషన్‌లో విద్యాసంస్థలు, పరిశోధనా సంస్థలు, పారిశ్రామిక రంగానికి చెందిన 7,500 మందికి పైగా ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు. అత్యాధునిక పరిశోధనలు, సాంకేతిక ఆవిష్కరణలు, వాటి జాతీయ ప్రాముఖ్యతను ప్రజలకు వివరించడానికి, భారతదేశ శాస్త్రీయ సంస్థలకు ప్రజలతో గల అనుబంధాన్ని మరింత పెంచడానికి ఈ వేదిక దోహదపడుతుందని భావిస్తున్నారు.

2026 సెప్టెంబర్ 25న జరగనున్న కార్యక్రమంతో పాటు సీఎస్ఐఆర్‌ఏ85ఏర్పాట్లు, ఈఎసీఐసీ-2026కు సంబంధించిన తాజా అంశాలను కూడా ఈ సమావేశంలో పరిశీలించారు. భారతదేశ శాస్త్రీయ సంస్థల విజయాలు, వాటి కృషిని సమర్థవంతంగా ప్రచారం చేయటం.. కార్యక్రమాలకు సన్నద్ధం కావడం, సమన్వయం చేసుకోవడం వంటి అంశాలపై చర్చించారు.

శాస్త్రీయ వ్యవస్థలో సహకారాన్ని, సమన్వయాన్ని పెంపొందించడానికి ఉద్దేశించిన చర్చలు (థీమాటిక్ ఇంటరాక్షన్లు), క్లస్టర్-ఆధారిత భాగస్వామ్యాలతో సహా మంత్రిత్వ శాఖల మధ్య, ఆయా విభాగాల మధ్య సమన్వయ విధానాలపై కూడా ఈ సమీక్షలో చర్చించారు. శాస్త్రీయ విజయాలను సమన్వయంతో ప్రచారం చేసేందుకు, వాటి విస్తృత వ్యాప్తిని సులభతరం చేయడానికి శాస్త్రీయ మంత్రిత్వ శాఖలు, విభాగాల ప్రసార బృందాల మధ్య క్రమమైన సమాచార మార్పిడి ఉండాలని చెప్పారు.

శాస్త్రీయ వ్యవస్థలో బలమైన సంస్థాగత సహకారం, సమన్వయంతో కూడిన సమాచార ప్రసారం, నిరంతర ప్రజా భాగస్వామ్యం భాగం కావాలని డాక్టర్ జితేంద్ర సింగ్ చెప్పారు. తద్వారా శాస్త్ర సాంకేతిక, ఆవిష్కరణల్లో భారత పురోగతి అందరికి కనిపించేలా, అందుబాటులో ఉండేలా, ప్రయోజనకరంగా ఉండేలా చూడటానికి ఉన్న ప్రాముఖ్యతను కూడా ఆయన ప్రధానంగా చెప్పారు.

ఈ కార్యక్రమాలను సమన్వయ పద్ధతిలో ముందుకు తీసుకెళ్లడం, శాస్త్రీయ సంస్థలు-ప్రజలకు మధ్య అనుసంధానాన్ని బలోపేతం చేయడం, భారత శాస్త్రీయ విజయాలు- ఆవిష్కరణలకు మరింత విస్తృతమైన గుర్తింపును తీసుకురావాలన్న ఆలోచనతో ఈ సమావేశం ముగిసింది.

# జీడికల్ రామచంద్రస్వామి పేరు రాష్ట్రవ్యాప్తంగా మారుమోగాలి

## బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించాలి.
## జాతరలోపు అభివృద్ధి పనులు పూర్తి చేయాలి: కడియం శ్రీహరి

వరంగల్, సెప్టెంబర్ 22:జీడికల్ వీరాచల రామచంద్రస్వామి ఆలయానికి గొప్ప చరిత్ర ఉందని, అందుకు అనుగుణంగా రాష్ట్రవ్యాప్తంగా ఆలయ పేరు మారుమోగేలా స్వామివారి బ్రహ్మోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించాలని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. నవంబర్‌లో కార్తీక మాసంలో జరగనున్న లింగాల ఘన్‌పూర్ మండలం జీడికల్ శ్రీ వీరాచల రామచంద్రస్వామి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై ఆలయ ప్రాంగణంలో జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝూతో కలిసి వివిధ శాఖల అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు.

అనంతరం ఆలయ ప్రాంగణంలో లింగాల ఘన్‌పూర్ మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 31 మంది ముఖ్యమంత్రి సహాయనిధి లబ్ధిదారులకు రూ.13.61 లక్షల విలువైన చెక్కులను జిల్లా కలెక్టర్‌తో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కడియం శ్రీహరి మాట్లాడుతూ ఎమ్మెల్యేగా ఎన్నికైన నాటి నుంచి జీడికల్ ఆలయ అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నట్లు తెలిపారు. గత



రెండు జాతరల్లో భక్తులకు మెరుగైన వసతులు కల్పించేందుకు కృషి చేశామని, ఈసారి గతం కంటే అధిక సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేయాలని అధికారులను సూచించారు.

జాతర ఏర్పాట్లలో అన్ని శాఖలను సమన్వయం చేసేందుకు జిల్లా స్థాయిలో ఒక నోడల్ అధికారిని నియమించాలని కలెక్టర్‌ను కోరారు. వేల సంఖ్యలో వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పారిశుధ్యం, తాగునీరు, విద్యుత్ వంటి మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అన్నారు. భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే లక్ష్యమని, అందుకు అవసరమైన పనులన్నింటినీ జాతరలోపు పూర్తి చేయాలని సూచించారు. ఆలయం ముందు సీసీ రోడ్డు పనులను వెంటనే పూర్తి చేయడంతో పాటు డివైడర్‌లో పచ్చదనం పెంచేందుకు మొక్కలు నాటాలని, కేంద్ర విద్యుత్ దీపాల ఏర్పాటు చేపట్టాలని సూచించారు.

శాశ్వత ప్రాతిపదికన నిరంతరం నీరు, విద్యుత్ సదుపాయాలు అందుబాటులో ఉండేలా సామూహిక మరుగుదొడ్లు నిర్మించాలని తెలిపారు. ఆలేరు నుంచి వచ్చే రహదారిలో జీడికల్ గ్రామ పరిధిలో పెండింగ్‌లో ఉన్న మూడు కిలోమీటర్ల రోడ్డు నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కల్యాణ మండపం పక్కన ఉన్న స్థలంలో పార్కు నిర్మించాలని సూచించారు. ఆలయ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు నీడనిచ్చే చెట్లను నాటి పచ్చదనంతో ఆహ్లాదకరంగా తీర్చిదిద్దాలని అన్నారు.

భక్తులకు మెరుగైన అత్యవసర వైద్య సేవలు అందుబాటులో ఉండేలా వైద్య సిబ్బంది, మందులు, అంబులెన్స్ సిద్ధంగా ఉంచాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారిని సూచించారు. భక్తుల భద్రత కోసం పోలీసుశాఖ పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాతర పరిసరాల్లో నిఘా వ్యవస్థను బలోపేతం చేయాలని అన్నారు. గొప్ప చరిత్ర కలిగిన జీడికల్ రామచంద్రస్వామి ఆలయ విశిష్టతను మరింత పెంచేలా బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించి, స్వామివారి పేరు రాష్ట్రవ్యాప్తంగా మారుమోగేలా చేయాలని అధికారులకు, స్థానిక నాయకులకు కడియం శ్రీహరి పిలుపునిచ్చారు.

కార్యక్రమంలో డీసీపీ రాజ మహేంద్ర నాయక్, ఆర్డీవో గోపి రామ్, ఆలయ చైర్మన్ నరసింహులు, ఆలయ కార్యనిర్వహణ అధికారి వంశీ, నాయకులు గుడి వంశీధర్‌రెడ్డి, కొల్లూరి శివకుమార్, సాదం విజయ్ మనోహర్, ఆలయ కమిటీ డైరెక్టర్లు, విద్యుత్, ఇంజనీరింగ్, మిషన్ భగీరథ, పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ, వైద్య, పోలీసు తదితర శాఖల అధికారులు, వివిధ గ్రామాల సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నల్లగొండ కార్పొరేషన్‌లో రెండు వెట్టింగ్ మెషిన్లు ప్రారంభం



నల్గొండ, సెప్టెంబర్ 22: నల్లగొండ కార్పొరేషన్‌లో అన్ని సౌకర్యాలు కల్పించి స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దడమే కాక బెస్ట్ కార్పొరేషన్ అవార్డు కూడా అందుకుంటామని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. మంగళవారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయం ఇందిరాభవన్ వద్ద నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్‌లో పరిశుభ్రతకు సంబంధించి కోటి 1 లక్ష రూపాయల వ్యయంతో ఏర్పాటు చేసిన రెండు వెట్టింగ్ మెషిన్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. ఇటీవల నల్లగొండ కార్పొరేషన్ స్వచ్ఛ అవార్డు అందుకుందని, నూతనంగా ఏర్పాటైన నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ లోని ప్రజలకు అన్ని రకాల సేవలు అందించేందుకు కృషి చేయడం జరుగుతున్నదని తెలిపారు. ముఖ్యంగా 24 గంటలు తాగునీరు అందించేందుకు రూ.83 కోట్లతో టెండర్లు పిలవడం జరిగిందన్నారు.

నల్లగొండ కార్పొరేషన్‌లో ఎస్ డి ఎఫ్ నిధులతో 63 కిలోమీటర్ల సీసీ రోడ్లు వేశామని, అలాగే తక్కిన డివిజన్లలో కూడా రోడ్లతో పాటు, డ్రైన్లు నిర్మిస్తామని, 6 నెలల్లో ఎస్‌టీపీ పూర్తి చేయనున్నట్లు మంత్రి తెలిపారు. నల్లగొండ కార్పొరేషన్‌కు అన్ని రకాల నిధులను తీసుకువచ్చి అభివృద్ధి చేసి ఉత్తమ కార్పొరేషన్ అవార్డు తీసుకుంటామనే నమ్మకం తమకున్నట్టు మంత్రి తెలిపారు. నల్లగొండ కార్పొరేషన్ పరిధిలో రూ.900 కోట్లతో ఔటర్ రింగ్ రోడ్డు నిర్మాణం చేపట్టామని, అలాగే డ్రైనేజీ, ఎస్ టి పి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్, మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి, డిప్యూటీ మేయర్ అమీర్ అలీ, మున్సిపల్ మాజీ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ వంశీకృష్ణ, ఆర్ అండ్ బి అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# గణేష్ శోభాయాత్ర, నిమజ్జనానికి పటిష్ట బందోబస్తు

**సుమారు 300 మంది పోలీసులతో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు**

**ప్రశాంతమైన, సంతోషకరమైన ఉత్సవాలతో ప్రజలకు ఇబ్బంది లేకుండా శోభాయాత్ర నిర్వహించుకోవాలి**

**డీజేలకు అనుమతి లేదు.. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు**

**-జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకాన్, ఐపిఎస్**



ములుగు, సెప్టెంబర్ 22:(నేటినిజం ప్రతినిధి): ములుగుజిల్లాలో గణేష్ శోభాయాత్ర, నిమజ్జన కార్యక్రమాలను ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు పోలీస్ శాఖ అన్ని ముందస్తు భద్రతా చర్యలు చేపట్టిందని జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకాన్ ఎఖూ గారు తెలిపారు.

గణేష్ నిమజ్జనం సందర్భంగా ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అన్ని శాఖల అధికారులతో సమన్వయం చేసుకుని విస్తృతమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

### 815 గణేష్ విగ్రహాలకు ఆన్‌లైన్ నమోదు, జియో ట్యాగింగ్

జిల్లాలో మొత్తం 815 గణేష్ విగ్రహాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసి జియో ట్యాగింగ్ చేయడం జరిగిందని ఎస్పీ తెలిపారు. దీని ద్వారా ప్రతి గణేష్ మండపం, విగ్రహం ఏర్పాటు చేసిన ప్రాంతం, నిమజ్జనానికి సంబంధించిన వివరాలు పోలీసులకు ముందుగానే అందుబాటులో ఉండటంతో పాటు, శోభాయాత్రలు, నిమజ్జన కార్యక్రమాలను సమర్థవంతంగా పర్యవేక్షించేందుకు వీలు కలుగుతుందని తెలిపారు.

### డీజేలకు అనుమతి లేదు

గణేష్ శోభాయాత్రల్లో డీజేలకు ఎలాంటి అనుమతి లేదని ఎస్పీ స్పష్టం చేశారు.

సుప్రీంకోర్టు మార్గదర్శకాలు, ఆర్డీఓ ఉత్తర్వుల ప్రకారం జిల్లాలో డీజేలను నిషేధించినట్లు తెలిపారు. నిబంధనలను ఉల్లంఘించి డీజేలను ఏర్పాటు చేస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

### ముందస్తు భద్రతా చర్యలు

శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా జిల్లా కలెక్టర్, రెవెన్యూ, మున్సిపల్, ఇతర శాఖల అధికారులతో సమన్వయ సమావేశాలు నిర్వహించడంతో పాటు గణేష్ ఉత్సవ కమిటీలు, మండపాల నిర్వాహకులు, ఆర్గనైజర్లు, యువత, మత పెద్దలతో పలు శాంతి సమావేశాలు నిర్వహించి శాంతియుతంగా పండుగను నిర్వహించడంపై అవగాహన కల్పించినట్లు తెలిపారు.

### సోషల్ మీడియాలో అనుచిత పోస్టులు చేస్తే కఠిన చర్యలు

గణేష్ నిమజ్జనం సందర్భంగా సోషల్ మీడియాలో రెచ్చగొట్టే, అనుచిత, వివాదాస్పద పోస్టులు, వ్యాఖ్యలు చేయవద్దని ఎస్పీ సూచించారు.

ఇతరుల మనోభావాలను కించపరిచే విధంగా పోస్టులు చేయడం, వదంతులు ప్రచారం చేయడం లేదా శాంతిభద్రతలకు విఘాతం కలిగించే సమాచారాన్ని సోషల్ మీడియాలో ప్రచారం చేస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

### శోభాయాత్ర, నిమజ్జనానికి పటిష్టమైన భద్రత ఏర్పాట్లు

గణేష్ శోభాయాత్ర, నిమజ్జనం సందర్భంగా జిల్లాలో సుమారు 300 మంది పోలీసులతో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ తెలిపారు. శోభాయాత్ర, నిమజ్జన కార్యక్రమాలను నిరంతరం పర్యవేక్షిస్తూ పరిస్థితులకు అనుగుణంగా వెంటనే స్పందించేలా ఏర్పాట్లు చేశామని పేర్కొన్నారు.

నిమజ్జన సమయంలో ప్రజలు తప్పనిసరిగా పాటించాల్సిన సూచనలు×

పోలీసుల సూచనలు, ఎట్టి పరిస్థితుల్లోనూ మీరకూడదు.

విగ్రహంతో పాటు కనీసం నలుగురు పెద్దలు ఉండేలా చూసుకోవాలి.

అనుమతి లేని ప్రాంతాల్లో ఎవరూ నీటిలోకి దిగకూడదు.

చిన్నారులను చెరువు, నది వైపు ఒంటరిగా పంపకూడదు.

ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన నిమజ్జన ప్రదేశాల్లోనే విగ్రహాలను నిమజ్జనం చేయాలి.

ఈత రాని వారు నీటిలోకి దిగకూడదు.

ట్రాక్టర్లు, లారీలు, ఇతర వాహనాలపై పరిమితికి మించి ప్రయాణించకూడదు.

వాహనాలపై నిలబడి ప్రయాణించకూడదు.

క్రేన్లు, పడవలు, స్విమ్మర్ల విధులకు ఎలాంటి ఆటంకం కలిగించకూడదు.

విద్యుత్ వైర్లు, లైటింగ్ ఏర్పాట్ల వద్ద అప్రమత్తంగా ఉండాలి.

నిమజ్జన ప్రాంతాల్లో తోపులాటకు పాల్పడకుండా క్రమశిక్షణ పాటించాలి.

మద్యం సేవించి శోభాయాత్రలో పాల్గొనడం, వాహనాలు నడపడం చేయకూడదు.

తప్పిపోయిన పిల్లలు, వృద్ధులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలి.

అత్యవసర పరిస్థితుల్లో వెంటనే సమీప పోలీస్ సిబ్బందిని సంప్రదించాలి.

ప్రజలు పరస్పరం సహకరించుకుంటూ మతసామరస్యాన్ని కాపాడాలని, తమ పండుగలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని కోరారు. ఎలాంటి వదంతులు, రెచ్చగొట్టే వ్యాఖ్యలు, అనుచిత పోస్టులను సోషల్ మీడియాలో ప్రచారం చేయవద్దని, ఇతరుల మనోభావాలను దెబ్బతీసే విధంగా వ్యవహరించవద్దని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్ట ప్రకారం చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

జిల్లా ప్రజలకు ఎస్పీ విజ్ఞప్తి

"గణేష్ ఉత్సవాలు భక్తి, శాంతి, సోదరభావానికి ప్రతీకగా నిలవాలి. ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ పోలీస్ శాఖకు సహకరించాలి. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా గణేష్ శోభాయాత్ర, నిమజ్జన కార్యక్రమాలను ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించుకుందాం. ప్రజల భద్రతే పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యం అని ఎస్పీ తెలిపారు.

# సీనియర్ సిటిజన్లకు ఆయుర్వేద వైద్య పరీక్షలు

ఖమ్మం, సెప్టెంబర్ 22: ఆయుర్వేద వైద్య దినోత్సవం సందర్భంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో చుంచుపల్లి ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల వారు విద్యానగర్ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ హాల్‌లో మంగళవారం మెగా వైద్య శిబిరం నిర్వహించారు.

ఈ సందర్భంగా జీఏడీ చుంచుపల్లి మెడికల్ ఆఫీసర్ డా.ఈ.ఉషారాణి, మొరంపల్లి బంజరు ఆయుర్వేద వైద్యాధికారి డా.జయ 70 మంది సీనియర్ సిటిజన్లకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులు పంపిణీ చేశారు. ఆరోగ్య పరిరక్షణపై పలు సూచనలు అందించారు. యోగా ఇన్‌స్ట్రక్టర్ కె.కమలారాణి వృద్ధులచే యోగాసనాలు చేయించి, వృద్ధాప్యంలో చేయాల్సిన ఆసనాలు, వాటి ప్రయోజనాలను వివరించారు. ఈ కార్యక్రమంలో విద్యానగర్ కాలనీ ఉప సర్పంచ్ వాసిరెడ్డి మురళి, సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కొల్లు నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి సురేష్, ఫార్మసిస్ట్ కె.రామకృష్ణ, ఎస్ఎన్ఓ వి.దిద్దుబాబు, ఆశా కార్యకర్తలు, నర్సింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.

# పారిశుధ్య పనుల నుంచి ఆర్థిక భద్రత దాకా: కర్నాటి శ్రీనివాసరావు ప్రయాణం

సరసమైన రుణాల లభ్యత, మూలధన రాయితీ, యాంత్రిక పారిశుధ్య పరికరాలు... సంరక్షితమైన, మరింత గౌరవప్రదమైన పనిని ప్రోత్సహిస్తానే, సుస్థిరమైన జీవనోపాధి అవకాశాలనూ సృష్టించగలవు. లేని పక్షంలో పరిమిత విద్య, తక్కువ ఆదాయం కారణంగా పెరుగుతున్న గృహ ఖర్చులను భరించడం, ఆర్థిక భద్రతను నిర్మించుకోవడం పారిశుధ్య కార్మికులకు కష్టమవుతుంది.

విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్‌లో పనిచేస్తున్న 53 ఏళ్ల పారిశుధ్య కార్మికుడు కర్నాటి శ్రీనివాసరావు, 'నమస్తే' పథకంలోని 'స్వచ్ఛతా ఉద్యమి యోజన' కింద అందిన సహాయంతో తన కుటుంబ ఆర్థిక పరిస్థితిని మెరుగుపరుచుకున్నారు. నలుగురు ఇతర సభ్యులతో కూడిన ఒక సమూహ ప్రాజెక్ట్ ద్వారా లభించిన మద్దతుతో, ఆయన ఇప్పుడు నెలకు సుమారు రూ. 10,000 అదనపు ఆదాయాన్ని ఆర్జిస్తున్నారు.

చిన్నతనంలో తీవ్రమైన ఆర్థిక ఇబ్బందుల కారణంగా శ్రీ రావు ఆరవ తరగతి తర్వాత చదువుకు స్వస్తి చెప్పాల్సి వచ్చింది. 2008లో విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్‌లో ఔట్‌సోర్సింగ్ పారిశుధ్య కార్మికుడిగా చేరి రూ. 2500 నెల జీతంతో కెరీర్ ప్రారంభించారు. ఆయన తన కుటుంబానికి మద్దతునివ్వడానికి కట్టుబడి ఉన్నారు. పరిమిత విద్యార్హతలు... ఆయనకు ఇతర ఉపాధి అవకాశాలు, అధిక సంపాదనలను నిరోధించాయి.

గృహ నిర్వహణ ఖర్చులు, చదువు సంబంధిత వ్యయాలు, అనుకోని ఖర్చులు పెరగడంతో... ఆర్థిక స్థిరత్వాన్ని సాధించడం ఆయనకు కష్టంగా మారింది. ఆయన భార్య గృహిణి కావడంతో, ఆ కుటుంబం ప్రధానంగా ఆయన సంపాదనపైనే ఆధారపడేది. కాలక్రమేణా ఆయన నెలవారీ ఆదాయం సుమారు రూ. 22,500కు పెరిగినప్పటికీ, రోజువారీ ఖర్చులను భరిస్తూనే భవిష్యత్తు అవసరాల కోసం పొదుపు చేయడం సవాలుగా మారింది. తన కుటుంబాన్ని పోషించుకోవడానికి, అత్యవసర పరిస్థితులను మరింత ధీమాతో ఎదుర్కోవడానికి వీలుగా అదనపు ఆదాయ వనరును సమకూర్చుకోవాలని శ్రీ రావు ఆశించారు.

శ్రీ రావు, మరో నలుగురు సభ్యులు కలిసి 21 ఆగస్టు 2025న గుల్పర్ 8 కేఎల్ డెస్లడ్జింగ్ వాహనాన్ని కొనుగోలు చేసే ఒక గ్రూప్ ప్రాజెక్ట్ కోసం స్వచ్ఛతా ఉద్యమి యోజన కింద సహాయం అందుకున్నారు. ఈ ప్రాజెక్ట్ మొత్తం వ్యయం రూ. 50 లక్షలు. ఈ ఆర్థిక సహాయంలో రూ. 31.25 లక్షల రుణం, రూ. 18.75 లక్షల ముందస్తు మూలధన సబ్సిడీ భాగంగా ఉన్నాయి. ఈ సహాయం వల్ల ఆ గ్రూప్ యాంత్రిక పారిశుధ్య సేవలను చేపట్టడానికి, అదనపు, స్థిరమైన జీవనోపాధిని అభివృద్ధి చేసుకోవడానికి వీలు కలిగింది.

ఈ ప్రాజెక్ట్ ద్వారా, శ్రీ రావు తన సాధారణ ఉద్యోగం ద్వారా పొందే ఆదాయానికి అదనంగా నెలకు సుమారు రూ. 10,000 సంపాదిస్తున్నారు. దీనివల్ల ఆయన మొత్తం నెలవారీ ఆదాయం సుమారు రూ. 22,500 నుంచి రూ. 32,500కు పెరిగింది. ఈ అదనపు ఆదాయం ఆర్థిక ఒత్తిడిని తగ్గించడమే కాకుండా, ఇంటి ఖర్చులను మరింత సౌకర్యవంతంగా నిర్వహించుకోవడం, భవిష్యత్తు కుటుంబ అవసరాల కోసం పొదుపు చేయడం ప్రారంభించడంలో ఆయనకు సహాయపడింది.

శ్రీ రావు ఈ రోజు తన కుటుంబం కోసం మరింత సురక్షితమైన, గౌరవప్రదమైన భవిష్యత్తు వైపు పయనిస్తున్నారు. పారిశుధ్య కార్మికులకు అందించే ఆర్థిక సహాయం, యాంత్రిక పారిశుధ్య పరిష్కారాలు జీవనోపాధిని ఎలా బలోపేతం చేయగలవో ఆయన అనుభవం నిరూపిస్తుంది. నమస్తే పథకం కింద ఉన్న స్వచ్ఛతా ఉద్యమి యోజన... ఆయన జీవన ప్రమాణాలను మెరుగుపరచుకోవడానికి, పొదుపు చేసుకోవడానికి, భవిష్యత్తుపై కొత్త నమ్మకాన్ని పెంచుకోవడానికి వీలు కల్పించింది.

# రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీలకు జిల్లా జట్ల ఎంపిక

నిజామాబాద్, సెప్టెంబర్ 21: ఎస్‌జీఎఫ్ 70వ రెజ్లింగ్ పోటీలకు ఉమ్మడి నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల క్రీడాకారుల ఎంపిక చేశారు. సెప్టెంబర్ 19న నిజామాబాద్‌లోని డీఎస్ఏ స్విమ్మింగ్ పూల్‌లో అండర్-14 బాలబాలికలకు సబ్ జూనియర్ రెజ్లింగ్ సెలక్షన్స్ నిర్వహించారు. ఈ పోటీల్లో వివిధ వెయిట్ కేటగిరీల్లో 61 మంది బాలికలు, 45 మంది బాలురు పాల్గొన్నారు.

ఎంపికైన క్రీడాకారులు రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీల్లో నిజామాబాద్ జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహించనున్నారు. అదేవిధంగా సెప్టెంబర్ 21న అండర్-17 బాలబాలికలకు రెజ్లింగ్ సెలక్షన్స్ నిర్వహించగా, 35 మంది బాలికలు, 68 మంది బాలురు పాల్గొన్నారు. వివిధ వెయిట్ కేటగిరీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన 10 మంది క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు నిజామాబాద్ ఎస్‌జీఎఫ్ కార్యదర్శి అలివేలి మంగ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రస్థాయిలో క్రీడాకారులు ప్రతిభ కనబరిచి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆమె ఆకాంక్షించారు. సెలక్షన్స్‌లో డీవైఎస్ఓ పవన్, పీడీ సంతోషి, దేవేందర్, వెంకట్ రాములు, కల్పన, ధర్మేందర్, సునీతతో పాటు వివిధ పాఠశాలల పీడీలు, పీఈటీలు, కామారెడ్డి జిల్లాకు చెందిన ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్లు పాల్గొన్నారు.

# మై భారత్ వెబ్‌సైట్లో సీఎస్ఐఆర్ క్విజ్‌ను నిర్వహిస్తున్న సైంటిఫిక్, ఇండస్ట్రియల్ రిసర్చ్ కౌన్సిల్

న్యూ ఢిల్లీ, సెప్టెంబర్ 22:సైంటిఫిక్, ఇండస్ట్రియల్ రిసర్చ్ కౌన్సిల్ (సీఎస్ఐఆర్) 85వ వ్యవస్థాపక దినోత్సవాల సందర్భంగా నిర్వహిస్తున్న కార్యక్రమాలలో భాగంగా మై భారత్ (మేరా యువ భారత్) వెబ్‌సైట్లో సీఎస్ఐఆర్ సైన్స్, ఇన్నొవేషన్ క్విజ్ (సీఎస్ఐఆర్ సైక్విజ్)ను ప్రారంభించారు. సైన్స్, టెక్నాలజీ శాఖలో భాగమైన సీఎస్ఐఆర్.. యువజన వ్యవహారాలు, క్రీడల శాఖకు చెందిన యువజన వ్యవహారాల విభాగం సహకారంతో ఈ క్విజ్ పోటీని నిర్వహిస్తోంది.

ఈ నెల 20 నుంచి 26 వరకు కొనసాగే క్విజ్‌లో భారత ప్రజలు పాల్గొనవచ్చు. క్విజ్‌లో బహుళ ఐచ్ఛిక ప్రశ్నలుంటాయి. శాస్త్రవిజ్ఞాన రంగంలో సీఎస్ఐఆర్ సాధించిన విజయాలు, చేసిన నూతన ఆవిష్కరణలు, సంస్థలతో పాటు సమాజానికీ, దేశానికీ సీఎస్ఐర్ అందిస్తున్న సేవకు సంబంధించిన ప్రశ్నలను అడుగుతారు.

ఆరోగ్యసంరక్షణ, వ్యవసాయం, పర్యావరణం, మౌలిక సదుపాయాల కల్పన, ఇంధనం, ఏరోస్పేస్, బయోటెక్నాలజీతో పాటు వ్యూహాత్మక సాంకేతికతలు సహా సీఎస్ఐఆర్ పరిధిలోకి వచ్చే వివిధ రంగాలపై ప్రశ్నలుంటాయి. సీఎస్ఐఆర్ పరిశోధనలు సమాజానికీ, పరిశ్రమకూ అవసరమైన పరిష్కారాలను ఏయే విధాలుగా అందిస్తున్నాయన్న ప్రస్తావనలు ఈ ప్రశ్నల్లో ఉంటాయి.

భారతదేశంలో ప్రధాన పరిశోధన ప్రయోగశాలల నెట్‌వర్క్‌ను గురించి తెలుసుకోవడానికి ఒక చర్చావేదికగా ఉపయోగపడుతూ, ప్రజలలో ముఖ్యంగా యువతలో విజ్ఞానశాస్త్రం పట్ల చైతన్యాన్నీ, ఆసక్తినీ, అభిరుచినీ పెంపొందింపచేయాలన్నదే ఈ క్విజ్ పోటీ ప్రధానోద్దేశం. ఇది ఈ పోటీలో పాల్గొనే వారికి విజ్ఞానశాస్త్ర రంగంలో సీఎస్ఐఆర్ సాధించిన విజయాలు, అవలంబించిన సాంకేతికతలు, నూతన ఆవిష్కరణలు, దేశ నిర్మాణానికి సంస్థ అందిస్తున్న తోడ్పాటును గురించి తెలుసుకొనే ఆకర్షణీయ అవకాశం లభిస్తుంది.

ఈ కార్యక్రమంలో భాగంగా, పోటీలో పాల్గొనే వారు సీఎస్ఐఆర్‌కు చెందిన తాము కోరుకున్న ఏదైనా ఒక ప్రయోగశాలను ఒక రోజు పాటు సందర్శించే అవకాశాన్ని చేజిక్కించుకుంటారు. ఈ అవకాశం వల్ల వారు దేశంలో విజ్ఞానశాస్త్ర పరిశోధన, నూతన ఆవిష్కరణలతో ముడిపడిన విస్తారిత అనుబంధ వ్యవస్థను గురించి నేరుగా తెలుసుకోవచ్చు.

సెప్టెంబర్ తరువాత కూడా సీఎస్ఐఆర్ సైక్విజ్‌ను కొనసాగిస్తారు. రాబోయే నెలల్లో మై భారత్ వెబ్‌సైట్లో మరిన్ని క్విజ్ కార్యక్రమాలను నిర్వహించాలన్న ఆలోచన కూడా ఉంది. సీఎస్ఐఆర్ పరిశోధన, నూతన ఆవిష్కరణలు, విజయాలతో ముడిపడిన వివిధ అంశాలను ఆయా క్విజ్‌లలో చేరుస్తారు.

ఈ కార్యక్రమం పౌరులకు విషయాలు తెలుసుకొనే, నేర్చుకునే, పోటీ పడే, విజేతలుగా నిలిచే అవకాశాలను అందిస్తుంది. అలాగే సైన్సునూ, నూతన ఆవిష్కరణలనూ సమాజానికి చేరువ చేసే దిశగా సీఎస్ఐఆర్ సాగిస్తున్న ప్రయాణంలో ఈ క్విజ్ రూపేణా ప్రజలు తామూ పాలుపంచుకోవచ్చు.

# లేబర్ కోడ్‌లపై కార్మికుల గళం

## హక్కుల హరణకు వ్యతిరేకంగా ఐక్య పోరాటం..

## పుట్టపర్తిలో వాటర్ వర్కర్లకు విద్యా, వైజ్ఞానిక శిక్షణ




ఖమ్మం, సెప్టెంబర్ 22:కార్మికుల హక్కులు, ఉద్యోగ భద్రత, పని పరిస్థితులపై ప్రభావం చూపే లేబర్ కోడ్‌లను వ్యతిరేకిస్తూ కార్మికులు ఐక్యంగా ఉద్యమించాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు కామ్రేడ్ ఓబులు పిలుపునిచ్చారు. హక్కుల పరిరక్షణకు కేవలం ఆందోళనలు సరిపోవని, కార్మిక చట్టాలు, ప్రభుత్వ విధానాలపై ప్రతి కార్మికుడూ అవగాహన పెంచుకోవాలని అన్నారు. శ్రీ సత్యసాయి వాటర్ వర్కర్స్ ఆధ్వర్యంలో పుట్టపర్తి కార్మిక కర్షక భవన్‌లో మంగళవారం నిర్వహించిన విద్యా, వైజ్ఞానిక శిక్షణా తరగతుల్లో ఆయన మాట్లాడారు. కార్యక్రమానికి మధుసూదన్ అధ్యక్షత వహించారు.

శిక్షణా తరగతుల ప్రారంభానికి ముందు ఓబులు జెండాను ఆవిష్కరించి ప్రారంభ ఉపన్యాసం చేశారు. కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు, వాటి పరిష్కారానికి సంఘటిత పోరాటాల అవసరాన్ని వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల హక్కులను పరిమితం చేసే విధంగా లేబర్ కోడ్‌లను తీసుకొచ్చాయని ఆయన విమర్శించారు. వేతనాలు, పని గంటలు, ఉద్యోగ భద్రత, పని ప్రదేశాల్లో రక్షణ వంటి అంశాలపై కార్మికులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్మిక చట్టాల్లో చోటుచేసుకుంటున్న మార్పులను తెలుసుకుని వాటిపై సమష్టిగా స్పందించాల్సిన అవసరం ఉందన్నారు.

కార్మిక వర్గం ఐక్యతను దెబ్బతీసే ప్రయత్నాలకు తావివ్వకుండా సంఘటితంగా ఉండాలని ఓబులు పిలుపునిచ్చారు. సమస్యలను వ్యక్తిగతంగా పరిష్కరించుకునే ప్రయత్నం కంటే యూనియన్ ద్వారా సమష్టిగా పోరాడితేనే హక్కుల పరిరక్షణ సాధ్యమవుతుందని పేర్కొన్నారు.

'శాస్త్రీయ అవగాహన' అంశంపై సీఐటీయూ జిల్లా అధ్యక్షులు జడ్పీ శ్రీనివాసులు మాట్లాడారు. సమాజంలో చోటుచేసుకుంటున్న మార్పులను శాస్త్రీయ దృక్పథంతో అర్థం చేసుకోవాలని సూచించారు. మూఢనమ్మకాలకు దూరంగా ఉంటూ వాస్తవాలను విశ్లేషించే అలవాటును పెంపొందించుకోవాలని అన్నారు. కార్మికుల్లో సామాజిక, ఆర్థిక, రాజకీయ అంశాలపై అవగాహన పెంచేందుకు శిక్షణా కార్యక్రమాలు ఉపయోగపడతాయని తెలిపారు.

'లేబర్ కోడ్‌లు?కార్మికులకు నష్టం' అంశంపై సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.ఎల్. నరసింహులు ప్రసంగించారు. లేబర్ కోడ్‌లతో కార్మికుల హక్కులు, ఉద్యోగ భద్రత, పని పరిస్థితులు, కార్మిక చట్టాల అమలుపై పడే ప్రభావాలను వివరించారు. కార్మికులు తమ హక్కులపై పూర్తి అవగాహన పెంచుకుని ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు.

కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి పైపల్లి గంగాధర్, వాటర్ వర్కర్స్ యూనియన్ నాయకులు మధు, నరేష్, ప్రభు, వెంకటేశ్, రాజారెడ్డి తదితరులతో పాటు కార్మికులు హరి శ్రీనివాసులు, సుధాకర్, రవి, శివప్రసాద్ పాల్గొన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారం, హక్కుల పరిరక్షణ కోసం భవిష్యత్తులోనూ ఐక్య పోరాటాలను కొనసాగించాలని నాయకులు పిలుపునిచ్చారు.

# మార్షల్ ఆర్ట్స్‌లో భీమ్‌గల్ విద్యార్థిని సత్తా..

నిజామాబాద్, సెప్టెంబర్ 21:హైదరాబాద్‌లోని కాటేదాన్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఆదివారం నిర్వహించిన ఓపెన్ నేషనల్ మార్షల్ ఆర్ట్స్ ఛాంపియన్‌షిప్‌లో భీమ్‌గల్ ఆక్స్‌ఫర్డ్ స్కూల్‌కు చెందిన విద్యార్థిని పోల్సాని రిషిక గోల్డ్ మెడల్ సాధించింది. ప్రపంచ నకయాను ఫోటోకాన్ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో రిషిక ప్రతిభ కనబరిచి బంగారు పతకం సాధించినట్లు పాఠశాల కరస్పాండెంట్ కోట.జగదీష్, కరాటే మాస్టర్ సురేష్ తెలిపారు.

ఈ సందర్భంగా కరస్పాండెంట్ కోట జగదీష్ మాట్లాడుతూ,చిన్న వయసులోనే మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ పొందుతూ జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని గోల్డ్ మెడల్ సాధించడం అభినందనీయమన్నారు. విద్యార్థిని మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.రిషికను పాఠశాల ప్రిన్సిపల్ కోట నిహారిక, ఉపాధ్యాయులు, పాఠశాల యాజమాన్యం అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం విద్యార్థి విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో గొప్పది

## పాల్గొన్న ఎమ్మెల్సీలు, కలెక్టర్, ఎస్పీ, మేయర్ప్రభుత్వ నిర్ణయాలు తెలుసుకోండి




నల్గొండ, సెప్టెంబర్ 22: విద్యార్థుల జీవితాలను తీర్చిదిద్దేది గురువులేనని, సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో గొప్పదని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో నల్లగొండలోని లక్ష్మి గార్డెన్‌లో నిర్వహించిన ఉత్తమ ఉపాధ్యాయ దినోత్సవ ? 2026 కార్యక్రమానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన 189 మంది జిహెచ్‌ఎం, ఎంఈవో, స్కూల్ అసిస్టెంట్, ఎస్జీటీలను ఘనంగా సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థుల నమోదు తగ్గినప్పటికీ నల్లగొండ జిల్లాలో 9 శాతం పెరగడం ఉపాధ్యాయుల కృషికి నిదర్శనమన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతున్నప్పటికీ విద్యార్థులు ప్రైవేటు పాఠశాలల వైపు ఎందుకు మొగ్గుచూపుతున్నారనే అంశంపై ఆలోచించాల్సిన అవసరం ఉందన్నారు. నల్లగొండలో రూ.200 కోట్లతో నిర్మిస్తున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల పనులు 50 శాతం పూర్తయ్యాయని చెప్పారు. విద్యార్థులకు చదువుతో పాటు ఆరోగ్యం, జీవిత లక్ష్యాలు, విలువలను నేర్పించాలని సూచించారు. పదో తరగతి అనంతరం ఇంటర్‌లో విద్యార్థుల వైఫల్యాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, మధ్యలో బడి మానేసే విద్యార్థుల వివరాలను సేకరించి కారణాలను విశ్లేషించాలని కోరారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగళి శ్రీపాల్ రెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయుల పనితీరును ప్రశంసించారు. విద్యార్థుల జీవితాలకు విద్య వెలుగునిస్తుందని, ఉపాధ్యాయులు అంకితభావంతో పని చేయాలని కోరారు. ఎమ్మెల్సీ శంకర్ నాయక్ మాట్లాడుతూ నవ సమాజ స్థాపనలో నేటి విద్యార్థులను తయారు చేయడంలో ఉపాధ్యాయుల సేవలు చిరస్మరణీయమని కీర్తించారు. నల్లగొండ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ సమాజంలో గురువులకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. డీఈఓ సుసింధర్ రావు మాట్లాడుతూ.. జిల్లాలో విద్యార్థుల నమోదు 9 శాతం పెరిగిందని, ఉపాధ్యాయులు పాఠశాల సమయానికి అదనంగా రోజుకు సుమారు గంటన్నర పని చేస్తున్నట్లు తెలిపారు.

జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ మాట్లాడుతూ.. విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీయడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమన్నారు. సోషల్ మీడియా, ఇంటర్నెట్ వల్ల ప్రయోజనాలతో పాటు ప్రతికూల ప్రభావాలు కూడా ఉన్నందున విద్యార్థులను సక్రమ మార్గంలో నడిపించే బాధ్యత ఉపాధ్యాయులు, తల్లిదండ్రులపై ఉందన్నారు. ఈ ఏడాది జిల్లాలో విద్యార్థుల సంఖ్య సుమారు 2 వేల మేర పెరిగిందని తెలిపారు. జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ మాట్లాడుతూ మార్కులు, ఫలితాలకే పరిమితం కాకుండా విద్యార్థుల్లో నైతిక విలువలు, గౌరవ భావం పెంపొందించాలని సూచించారు. డీఈవో పి.సుశీంద్ర రావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ అమీర్ అలీ, కార్పొరేటర్ గుమ్మల జానకిమోహన్ రెడ్డి, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు కాళం నారాయణరెడ్డి, బత్తిని బాస్కర్, నిమ్మగొట్టి జానార్దన్, పెరుమళ్ల వెంకటేశం, సమగ్ర శిక్ష సెక్టోరియల్ అధికారులు ఎ.శ్రీనివాస్ గౌడ్, శ్రీనయ్య, రవి, సూపరింటెండెంట్ పవన్ కుమార్, విద్యాశాఖ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# పర్యాటక దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలి.

## -జిల్లా కలెక్టర్ బోర్ఢడే హేమంత్ సహదేవరావు.



ములుగు, సెప్టెంబర్ 22:(నేటినిజం ప్రతినిధి): పర్యాటక దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ బోర్ఢడే హేమంత్ సహదేవరావు సంబంధిత అధికారులను ఆదేశించారు.

మంగళవారం జిల్లా కలెక్టర్ తన చాంబర్లో జిల్లా లో నిర్వహించే ప్రపంచ పర్యాటక దినోత్సవ కార్యక్రమాల ఏర్పాట్లు, నిర్వహణపై పర్యాటక, విద్యా, పురావస్తు, అటవీ, ఇతర శాఖల అధికారులతో కలెక్టర్ సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు.

ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... చారిత్రక ఆలయాల వద్ద పారిశుధ్య నిర్వహణ, మౌలిక సదుపాయాలు కల్పించాలని, అందుకు సంబంధిత అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు.

యువ టూరిజం క్లబ్ లో నమోదయి ఉన్న విద్యార్థులకు పర్యాటక, వారసత్వ సంపద పై మండల, జిల్లా స్థాయి వ్యాస రచన, చిత్రలేఖన, వక్తృత్వ పోటీలను నిర్వహించాలని డీఈఓ, డిఐఈ ఓలకు సూచించారు.

ప్రపంచ పర్యాటక దినోత్సవం నేపథ్యంలో ఈ నెల 25 వ తేదీన వెంకటా పూర్ మండలం పాలంపేట గ్రామం గొల్లల గుడి వద్ద హెరిటేజ్ వాక్ ను పర్యాటకశాఖ ఆధ్వర్యంలో నిర్వహించాలని పేర్కొన్నారు.

హెరిటేజ్ వాక్ లో యువ టూరిజం క్లబ్ విద్యార్థులు, యువత, అధికారులు, ప్రజలు పాల్గొనాలని సూచించారు. రామప్ప ఆలయ ప్రాంగణంలో ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకొని సంస్కృతిక కార్యక్రమాలను ఘనంగా నిర్వహించేందుకు పర్యాటకశాఖ ఏర్పాట్లను పూర్తి చేయాలన్నారు.

26వ తేదీన ఉదయం 8 గంటలకు తెలంగాణ దర్శిని కార్యక్రమంలో భాగంగా యువ టూరిజం క్లబ్ విద్యార్థులకు జిల్లాలోని చారిత్రక ప్రదేశాలను సందర్శించేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు.

ఈ సమావేశంలో జిల్లా అటవీ శాఖ అధికారి వికాస్ మీనా, జిల్లా అదనపు కలెక్టర్ సంపత్ రావు, ఇంచార్జీ జిల్లా పర్యాటక శాఖ నోడల్ అధికారి ధర్మ నాయక్ డీఈవో సిద్ధార్థ రెడ్డి, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# శ్రీకాకుళం జిల్లాలో విస్తారంగా వర్షాలు

అమరావతి, సెప్టెంబర్ 22:: శ్రీకాకుళం జిల్లాలో విస్తారంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు జిల్లా అధికారులను అప్రమత్తం చేశారు. మంగళవారం కూడా కలెక్టర్, ఎస్పీలతో మాట్లాడి జిల్లాలో నెలకొన్న పరిస్థితులపై ఎప్పటికప్పుడు సమాచారం తెలుసుకున్నారు. నీటిపారుదల, రెవెన్యూ, విద్యుత్ శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని, తీరప్రాంత గ్రామాల ప్రజలను కూడా అప్రమత్తం చేయాలని సూచించారు.నదీ పరివాహక ప్రాంతాల్లోని ప్రజలు జాగ్రత్తగా ఉండాలని మంత్రి తెలిపారు. చెట్ల కింద, శిథిలావస్థలో ఉన్న భవనాలు, హోర్డింగుల సమీపంలో ప్రజలు ఉండరాదని సూచించారు. లోతట్టు ప్రాంతాల్లో నివసించే ప్రజలను అవసరమైతే సురక్షిత ప్రాంతాలకు తరలించాలని అధికారులను ఆదేశించారు.

ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు ముందస్తుగా సిద్ధంగా ఉండాలని స్పష్టం చేశారు.ముందస్తు సన్నద్ధత, అప్రమత్తతతో ప్రాణ, ఆస్తి నష్టం లేకుండా చర్యలు చేపట్టాలని మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశించారు.

# ఏసీల మెయింటెనెన్స్ పట్టించుకోకపోవడం వల్లే ఇద్దరు చిన్నారులు మృతి చెందారు : మాజీ మంత్రి జోగు రామన్న

ఆదిలాబాద్, సెప్టెంబర్ 22: అధికారుల నిర్లక్ష్యం కారణంగానే చిన్నపిల్లల వార్డులో అగ్ని ప్రమాదం జరిగింది. ఏసీల మెయింటెనెన్స్ పట్టించుకోకపోవడం వల్లే ప్రమాదంలో ఇద్దరు చిన్నారులు చనిపోయారని మాజీ మంత్రి జోగు రామన్న ఆరోపించారు. మంగళవారం ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌తో కలిసి అదిలాబాద్ రిమ్స్‌ను సందర్శించారు. చిన్నపిల్లల వార్డులో ప్రమాదం వివరాలను అడిగి తెలుసుకున్నారు

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..చిన్నారుల మరణం ప్రభుత్వ హత్యలేనని మండిపడ్డారు. ఈ ఘటనపై ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దవాఖానలో వసతులపై ప్రభుత్వానికి వినతులు అందించిన పట్టించుకోలేదని విమర్శించారు. బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకొని సహాయం అందించాలన్నారు.కాగా, ఆదిలాబాద్‌లోని రిమ్స్‌లో సోమవారం అర్ధరాత్రి అగ్నిప్రమాదం చోటుచేసుకున్నది. ఈ ఘటనలో ఓ పసికందు మరణించింది. చిన్నపిల్లల వార్డులో షార్ట్‌సర్క్యూట్ కారణంగా ఏసీ పేలడంతో ఒక్కసారిగా దట్టమైన పొగలు అలుముకున్నాయి. అప్రమత్తమైన సిబ్బంది వెంటనే వార్డులోని చిన్నారులను బయటకు తీసుకొచ్చారు. వార్డులో సుమారు 30 మంది చిన్నారులు ఉండగా, పలువురు అస్వస్థతకు గురయ్యారు. వీరిని చికిత్స నిమిత్తం ప్రైవేట్ దవాఖానకు తరలించారు.

# ఎర్రగడ్డ మెంటల్

# ఆధునిక నగరంగా తీర్చిదిద్దాలి: మంత్రి టీజీ భరత్



అమరావతి, సెప్టెంబర్ 22: నగర అభివృద్ధి పనులను ప్రణాళి కాబద్ధంగా ముందుకు తీసుకెళ్లాలని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఆహార శుద్ధి శాఖ మంత్రి టీజీ భరత్ గుప్తా అన్నారు. మంగళ వారం స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ (హెచ్ఏఎం) కింద రూ.246 కోట్లతో కర్నూలు నగరపాలక సంస్థ, గూడూరు, ఆదోని, ఎమ్మిగనూరు ప్రాంతాల్లో చేపట్టనున్న పార్కులు, వీధి దీపాలు, సెంట్రల్ మీడియన్లు, రోడ్లు తదితర అభివృద్ధి పనులను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కువ్వం నుంచి వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని మంత్రి టీజీ భరత్ గుప్తా, కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వీక్షించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అభివృద్ధి పనులను ముందుగానే సమీక్షించి, అవసరమైన చర్యలను ముందస్తుగా చేపట్టడం ద్వారా చివరి నిమిషంలో ఎదురయ్యే సమస్యలను నివారించవచ్చన్నారు. ముఖ్యంగా నీటి ఎద్దడి వంటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్‌లో అమలవుతున్న ఉత్తమ విధానాలను అధ్యయనం చేసి కర్నూలు నగరపాలక సంస్థలోనూ అమలు చేయాలని అధికారులకు సూచించారు. కర్నూలును ఆధునిక సదుపాయాలతో అభివృద్ధి చేసి స్మార్ట్ సిటీ స్థాయికి తీసుకెళ్లడమే లక్ష్యంగా పనిచేయాలన్నారు.

ప్రజల నుంచి, సచివాలయాల ద్వారా వచ్చే సమస్యలు, ఫిర్యాదులను అధికారులు సహనంతో స్వీకరించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు తగ్గకుండా ప్రత్యేకంగా పర్యవేక్షణ చేపట్టాలన్నారు. కర్నూలు నగర అభివృద్ధి ఒక్కరి వల్ల సాధ్యమయ్యే పని కాదని, ప్రజాప్రతినిధులు, అధికారులు, సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేసినప్పుడే ఆశించిన ఫలితాలు సాధ్యమవుతాయని పేర్కొన్నారు. బృంద స్ఫూర్తితో అభివృద్ధి పనులను వేగవంతం చేసి ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు అందించేందుకు సమష్టిగా కృషి చేయాలని అధికారులను ఆదేశించారు.

కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు మాట్లాడుతూ కర్నూలు పట్టణాన్ని ఆధునిక మౌలిక వసతులతో సుందర నగరంగా అభివృద్ధి చేయాల్సిన బాధ్యత ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులందరిపై ఉందన్నారు. కర్నూలు కార్పొరేషన్‌తో పాటు గూడూరు, ఆదోని, ఎమ్మిగనూరు ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి మొత్తం రూ.246 కోట్ల నిధులు మంజూరైనట్లు తెలిపారు. ఇందులో కర్నూలు నగర పాలక సంస్థకు రూ.153 కోట్లు కేటాయించినట్లు వెల్లడించారు. నగరంలో రోడ్లు, డ్రైనేజీ, వీధి దీపాలు తదితర మౌలిక వసతులను మెరుగు పరచడంతో పాటు ప్రమాదకర ప్రాంతాలను గుర్తించి ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. విశాఖపట్నం వంటి అభివృద్ధి చెందిన నగరాలతో పోటీపడే స్థాయిలో కర్నూలును తీర్చిదిద్దేందుకు సమష్టి కృషి అవసరమని పేర్కొన్నారు.

జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి మాట్లాడుతూ జిల్లాలోని మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో మౌలిక వసతుల అభివృద్ధికి హెచ్ఏఎం కింద రూ.246 కోట్ల విలువైన అభివృద్ధి పనులను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. పట్టణాల్లో ఇంటింటి చెత్త సేకరణతో పాటు రోడ్లు, వీధి దీపాలు, పార్కులు, సెంట్రల్ మీడియన్ల అభివృద్ధికి ఇప్పటికే సీఎస్ఆర్ నిధుల ద్వారా సాధ్యమైనంత మేరకు చర్యలు చేపట్టినప్పటికీ, ఇంకా కొన్ని మౌలిక వసతుల లోటుపాట్లు ఉన్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో పట్టణాల సమగ్ర అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. మంజూరైన నిధులతో పార్కులు, సెంట్రల్ మీడియన్లు, రోడ్లు, వీధి దీపాలను అభివృద్ధి చేయడంతో పాటు పట్టణ సుందరీకరణకు చర్యలు చేపట్టనున్నట్లు వివరించారు.

పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత మాట్లాడుతూ కార్పొరేషన్ పరిధిలో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. గతంలో పాణ్యం నియోజకవర్గ పరిధిలో 16 వార్డులు ఉండగా ప్రస్తుతం 22 వార్డులకు విస్తరించాయని తెలిపారు. 2014?19 మధ్య 16 వార్డులకు సుమారు రూ.100 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం కర్నూలు నగరపాలక సంస్థ అభివృద్ధి పనులకు రూ.153 కోట్లు కేటాయించగా, అందులో రూ.116 కోట్లు సంబంధిత వార్డుల అభివృద్ధికి కేటాయించడం సంతోషకరమన్నారు. కార్పొరేషన్ పరిధిలో తాగునీటి సమస్య పరిష్కారానికి అమృత్ 2.0 పథకం కింద రూ.137.50 కోట్లు మంజూరు చేసి పనులు ప్రారంభించినట్లు తెలిపారు. నీటి నిల్వ కోసం ఈఎల్ఎస్ఆర్ ట్యాంకుల నిర్మాణానికి అదనంగా రూ.54 కోట్లు కేటాయించడంతో మొత్తం రూ.192 కోట్లతో తాగునీటి వసతులను మెరుగు పరచనున్నట్లు ఎమ్మెల్యే వెల్లడించారు. కార్యక్రమంలో కర్నూలు మున్సిపల్ కమిషనర్ ఓబులేసు, విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ పార్వతమ్మ, సివిల్ సప్లైస్ కార్పొరేషన్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ, అదనపు మున్సిపల్ కమిషనర్ కృష్ణ, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## కొత్త పెన్షన్లపై మంత్రి సీతక్క కీలక ఆదేశాలు.. దసరాకు ముందే పంపిణీ!

హైదరాబాద్, సెప్టెంబర్ 22:: తెలంగాణలో కొత్త పెన్షన్లపై మంత్రి సీతక్క కీలక ఆదేశాలు జారీ చేశారు. అక్టోబర్‌లో కొత్త పెన్షన్ల ప్రారంభానికి చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. దసరా పండుగకు ముందే అర్హులైన లబ్ధిదారులకు కొత్త పెన్షన్లు అందేలా చూడాలని సూచించారు. క్షేత్రస్థాయి వెరిఫికేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. అవసరమైతే అదనపు సిబ్బందిని నియమించి ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ఈ మేరకు సెర్ప్ సీఈవో దివ్యా దేవరాజన్‌కు మంత్రి ఆదేశాలు జారీ చేశారు.ఒంటరి మహిళలు, వితంతువులకు పూర్తి స్థాయిలో పెన్షన్లు అందజేయాలని మంత్రి సూచించారు. దరఖాస్తు చేసుకున్న అర్హులందరికీ పెన్షన్లు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దసరా నాటికి కొత్త పెన్షన్ల పంపిణీకి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ పెన్షన్ అందేలా చర్యలు తీసుకుంటామని మంత్రి సీతక్క స్పష్టం చేశారు.

# ములుగు పట్టణ కాంగ్రెస్ నాయకులకు ఘన సన్మానం...

### రాష్ట్ర మంత్రివర్యులు దనసరి అనసూయ సీతక్క ఆదేశానుసారం జిల్లా అధ్యక్షులు పైడాకుల అశోక్ అన్న సూచన మేరకు



ములుగు, సెప్టెంబర్ 22:(నేటినిజం ప్రతినిధి): ఇటీవల జిల్లా, ములుగు మండల, పట్టణ, కమిటీలలో ములుగు పట్టణం నుంచి నూతనంగా ఎన్నికైన కాంగ్రెస్ పార్టీ ములుగు మండల అధికార ప్రతినిధి బోడ రఘు, ములుగు పట్టణ కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి కోగిల రాంబాబు, ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు ఓరుగంటి అనిల్, ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి మాదారపు రాజు లను కాంగ్రెస్ పార్టీ ములుగు మండల అధ్యక్షులు ముసిన పెల్లి కుమార్ గౌడ్ మరియు బీసీ సెల్ ములుగు జిల్లా అధ్యక్షులు వంగ రవి యాదవ్ ఘనంగా సన్మానించడం జరిగింది ...

ఈ సందర్భంగా మండల అధ్యక్షులు ముసిన పెల్లి కుమార్ గౌడ్ మరియు బీసీ సెల్ ములుగు జిల్లా అధ్యక్షులు వంగ రవి యాదవ్ మాట్లాడుతూ ములుగు జిల్లా, మండలం మరియు పట్టణం నుండి ఎన్నికైన సోదరులకు శుభాకాంక్షలు తెలియజేశారు నూతనంగా ఎన్నికైన వారు ములుగు జిల్లా మండలం పట్టణంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ, సీతక్క నాయకత్వాన్ని బలపరుస్తూ, అహర్నిశలు పార్టీ అభివృద్ధి కోసం పనిచేయాలని వారు అన్నారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు యాసనీ రవికుమార్ , నద్దునూరి రమేష్, మున్సిపల్ కో ఆప్షన్ నెంబర్ కుక్కల నాగరాజు, కాంగ్రెస్ పార్టీ పత్తిపల్లి గ్రామ అధ్యక్షులు ఆర్షం రఘు, బొచ్చు సమ్మయ్య ఓడ రాజు,,బీసీ సెల్ ములుగు మండల అధ్యక్షులు గుండ బిక్షపతి, కార్మిక విభాగం ములుగు మండల అధ్యక్షులు గూడెల్లి ఓదెలు కాంగ్రెస్ పార్టీ నాయకులు కవ్వం పెల్లి సారయ్య,, బీట్ల కొమురయ్య, మైనార్టీ నాయకులు సలీం పాషా తదితరులు పాల్గొన్నారు

# పట్టణాల్లో ప్రపంచ స్థాయి మౌలిక వసతులు రావాలి..

**26 జిల్లాల్లో రూ.11,360 కోట్ల పనులకు శ్రీకారం**
**హెచ్ఏఎం విధానంలో అభివృద్ధి పనులు**
**2,165 కి.మీ. రహదారుల నిర్మాణం**
**502 పార్కులు.. 391 కి.మీ. వీధి దీపాలు**
**ప్రజాప్రతినిధులు పూర్తి బాధ్యత తీసుకోవాలి**
**2047 నాటికి స్వర్ణ మున్సిపాలిటీలుగా అభివృద్ధి**

చిత్తూరు, సెప్టెంబర్ 22: పట్టణాల ముఖచిత్రం మారాలని, ప్రపంచ స్థాయి మౌలిక వసతులతో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. పట్టణాలు కేవలం నివాస ప్రాంతాలుగా కాకుండా పరిశ్రమలు, ఉపాధి, వ్యాపారం, విద్య, వైద్యం, సేవారంగాలకు ప్రధాన కేంద్రాలుగా అభివృద్ధి చెందాలని సూచించారు. రాష్ట్రంలోని 26 జిల్లాల్లో 123 మున్సిపాలిటీల పరిధిలో రూ.11,360 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు మంగళవారం కుప్పం నుంచి శంకుస్థాపన చేసిన అనంతరం మున్సిపల్ కమిషనర్లు, ఎమ్మెల్యేలను ఉద్దేశించి సీఎం ప్రసంగించారు.



పట్టణాలు ఆర్థికాభివృద్ధికి చోదకశక్తులని చంద్రబాబు పేర్కొన్నారు. వ్యవసాయంపై అధికంగా ఆధారపడటాన్ని తగ్గిస్తూ పట్టణ ప్రాంతాల్లో సేవారంగాన్ని బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. పరిశ్రమలు, ఉపాధి అవకాశాలు, వ్యాపారం, విద్య, వైద్యం వంటి రంగాలు పట్టణాల్లో విస్తరించేలా ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. పట్టణాల అభివృద్ధి ద్వారా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను మరింత బలోపేతం చేయవచ్చని అన్నారు.

గత పాలనలో మున్సిపాలిటీల్లో చెత్త, చెదారం, మురుగునీరు పేరుకుపోయి ప్రజలకు ఇబ్బందులు ఎదురయ్యాయని చంద్రబాబు పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం అందించే నిధులను సద్వినియోగం చేసుకోవడంలో గతంలో నిర్లక్ష్యం జరిగిందని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కేంద్రంతో సమన్వయం చేసుకుని పట్టణాభివృద్ధికి అవసరమైన నిధులను సమకూర్చుకుంటూ పనులను వేగవంతం చేస్తున్నామని తెలిపారు.

నిధుల కొరతతో అభివృద్ధి పనులు నిలిచిపోకుండా తొలిసారిగా హైబ్రిడ్ యాన్యుటీ విధానాన్ని అమలు చేస్తున్నామని ముఖ్యమంత్రి చెప్పారు. పట్టణ స్థానిక సంస్థలపై ఒక్కసారిగా ఆర్థిక భారం పడకుండా ఈ విధానంలో పనులు చేపడుతున్నట్లు తెలిపారు. పనుల నాణ్యతను కాపాడేందుకు నిర్మాణ సంస్థలకే పదేళ్ల పాటు నిర్వహణ బాధ్యతలను అప్పగించే విధానం తీసుకొస్తున్నామని వివరించారు. అభివృద్ధి పనులకు పదేళ్లలో 40 వాయిదాలుగా చెల్లింపులు చేసే విధానాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు.

రాష్ట్రవ్యాప్తంగా చేపడుతున్న అభివృద్ధి పనుల్లో రహదారుల నిర్మాణానికి రూ.4,656 కోట్లు కేటాయించినట్లు చంద్రబాబు తెలిపారు. సెంట్రల్ మీడియన్లకు రూ.88 కోట్లు, వీధి దీపాలకు రూ.247 కోట్లు, పార్కుల అభివృద్ధికి రూ.509 కోట్లు కేటాయించినట్లు చెప్పారు. ఈ ప్రాజెక్టుల ద్వారా సుమారు 2,165 కిలోమీటర్ల రహదారులు, 502 పార్కులు, 210 కిలోమీటర్ల సెంట్రల్ మీడియన్లు, 391 కిలోమీటర్ల వీధి దీపాల వ్యవస్థ, 300 కిలోమీటర్ల మురుగునీటి పారుదల పనులు చేపట్టనున్నట్లు వివరించారు.

పట్టణాభివృద్ధి పనులపై ఎమ్మెల్యేలు, మంత్రులు, ఎంపీలు పూర్తి బాధ్యత తీసుకోవాలని సీఎం సూచించారు. మున్సిపల్ కమిషనర్లు, ప్రజాప్రతినిధులు ప్రతిరోజూ క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ప్రజల సమస్యలను తెలుసుకోవాలని అన్నారు. కార్యాలయాలకే పరిమితం కాకుండా పట్టణాల్లో జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతిని ప్రత్యక్షంగా పరిశీలించాలని సూచించారు. ప్రజల భాగస్వామ్యం లేకుండా ఏ అభివృద్ధి కార్యక్రమం కూడా శాశ్వతంగా నిలవదని స్పష్టం చేశారు.

'స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర' లక్ష్యంతో ప్రతి పట్టణాన్ని పరిశుభ్రంగా, సుందరంగా తీర్చిదిద్దాలని చంద్రబాబు అన్నారు. ఇంటింటి చెత్త సేకరణను సమర్థంగా నిర్వహించడంతో పాటు ఆధునిక యంత్రాలతో రహదారుల శుభ్రతను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ఇప్పటికే భారీగా పేరుకుపోయిన పాత వ్యర్థాలను తొలగించామని, మిగిలిన వ్యర్థాలను కూడా అక్టోబరు 2 నాటికి పూర్తిగా తొలగించాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. వ్యర్థాల నుంచి విద్యుత్ ఉత్పత్తి చేసే కేంద్రాలను పెంచడంతో పాటు రీసైక్లింగ్‌కు ప్రాధాన్యత ఇవ్వాలని చెప్పారు.

ప్రజలకు పురపాలక సేవలను వేగంగా, పారదర్శకంగా అందించేందుకు అనేక సంస్కరణలు చేపట్టామని ముఖ్యమంత్రి తెలిపారు. గతంలో భవన నిర్మాణ అనుమతులకు 90 రోజులు పట్టేదని, ప్రస్తుతం సాధారణ భవనాలకు 15 రోజుల్లో అనుమతులు ఇచ్చేలా చర్యలు చేపట్టామని చెప్పారు. ఎత్తైన భవనాలకు 72 గంటల్లో అనుమతులు ఇచ్చే విధానాన్ని అమలు చేస్తున్నట్లు వివరించారు. పురమిత్ర, మనమిత్ర, వాట్సాప్ పాలన వంటి సాంకేతిక సేవల ద్వారా పన్నుల చెల్లింపులు, ధ్రువపత్రాల జారీ వంటి సేవలను ప్రజలకు సులభతరం చేశామని తెలిపారు.

పట్టణ పేదలకు గృహ వసతి కల్పించడంతో పాటు ఆక్షేపణ లేని భూముల్లో నివసిస్తున్న అర్హులైన పేదలకు పట్టాలు పంపిణీ చేస్తున్నామని చంద్రబాబు చెప్పారు. పట్టణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసేందుకు వారాంతపు కార్యక్రమాలు, హోటళ్లు, హోమ్‌స్టేలు, పర్యాటక సౌకర్యాలను అభివృద్ధి చేయాలని సూచించారు. మహిళల సాధికారతకు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలు కూడా పట్టణ ఆర్థిక వ్యవస్థకు దోహదపడతాయని పేర్కొన్నారు.

ప్రతి మున్సిపాలిటీని 2047 నాటికి 'స్వర్ణ మున్సిపాలిటీ'గా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని సీఎం స్పష్టం చేశారు. నాణ్యమైన విద్య, అత్యుత్తమ వైద్యం, పరిశుభ్రమైన వాతావరణం, పచ్చదనం, సమృద్ధిగా ఆక్సిజన్, 24 గంటల తాగునీటి సరఫరా వంటి సౌకర్యాలు ప్రజలకు అందేలా పట్టణాలను తీర్చిదిద్దాలని సూచించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు అంకితభావంతో పనిచేసి ప్రజల జీవన ప్రమాణాలను పెంచేలా పట్టణాలను సుందరంగా, పరిశుభ్రంగా, సౌకర్యవంతంగా అభివృద్ధి చేయాలని చంద్రబాబు కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్‌మెంట్ శాఖ ముఖ్య కార్యదర్శిగా ఎస్. సురేష్ కుమార్, చిత్తూరు ఎంపీ దగ్గుమల్ల ప్రసాదరావు, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ చైర్మన్ మునిరత్నం తదితరులు పాల్గొన్నారు.

# సెమీకాన్ ఇండియా-2026: 'సిలికాన్ టు సిస్టమ్స్' దాకా భారత సెమీకండక్టర్ రంగ ప్రస్థానంపై ప్రదర్శన

న్యూ ఢిల్లీ, సెప్టెంబర్ 22:భారత సెమీకండక్టర్ రంగ సామర్థ్యం, పురోగమన వేగం ప్రపంచానికి ప్రస్ఫుటమయ్యాయి. ఈ మేరకు న్యూఢిల్లీలోని యశోభూమి వేదికగా మూడు రోజులపాటు నిర్వహించిన సెమీకాన్ ఇండియా-2026 ప్రదర్శన దేశ శక్తిసామర్థ్యాలను ఆవిష్కరించింది. చిప్ డిజైన్, అత్యాధునిక ప్యాకేజింగ్ నుంచి మెటీరియల్స్, పరికరాలు, కృత్రిమ మేధ, హై-పెర్ఫార్మెన్స్ కంప్యూటింగ్ దాకా సెమీకండక్టర్ వ్యవస్థలోని వివిధ విభాగాలను ఈ ప్రదర్శన ఒకే వేదికపైకి తెచ్చింది.

ఇది 'సెమీకాన్ ఇండియా' 5వ ప్రదర్శన కాగా, "సిలికాన్ టు సిస్టమ్స్: బిల్డింగ్ ది ఇకోసిస్టమ్" ఇతివృత్తంగా ఈ నెల 17 నుంచి 19 వరకూ సాగింది. ఈ కార్యక్రమంలో పరిశ్రమ అగ్రగాములు, విధాన రూపకర్తలు, పెట్టుబడిదారులు, విద్యావేత్తలు, అంకుర సంస్థలు సహా అంతర్జాతీయ సెమీకండక్టర్ పరిశ్రమ ఒకే వేదికపైకి వచ్చింది. ఇందులో వివిధ దేశాల నుంచి 600కు పైగా ప్రదర్శన కంపెనీలతోపాటు ఒక అంకుర సంస్థల పెవిలియన్, వర్క్‌ఫోర్స్ డెవలప్‌మెంట్ పెవిలియన్, కేంద్ర-రాష్ట్ర స్థాయి పెవిలియన్‌లు ఏర్పాటు కావడమే కాకుండా ఒక హ్యాకథాన్ కూడా నిర్వహించారు.

భారత సెమీకండక్టర్ ప్రస్థానం డిజైన్‌ను మించి తయారీ, ప్యాకేజింగ్, పరిశోధన, మెటీరియల్స్, ప్రతిభ, వ్యవస్థ స్థాయి అనువర్తనాలను అనుసంధించే ఒక విస్తృత వ్యవస్థ వైపు విస్తరిస్తున్న తీరును ఒక సంగ్రహావలోకనం వివరించింది.

స్వదేశీ సెమీకండక్టర్, కంప్యూటింగ్ సామర్థ్యాల శ్రేణి ఈ ప్రదర్శనలోని కీలకాంశాల్లో ఒకటిగ నిలిచింది. ఇందులో భాగంగా హై-పెర్ఫార్మెన్స్ కంప్యూటింగ్, ఏఐ, రంగాలలో సి-డాక్ తన కృషిని ప్రదర్శించింది. దీనిలో ఏయూఎం హెచ్‌పీసీ-ఏఐ ప్రాసెసర్, రుద్ర-ఏయూఎం కంప్యూట్ నోడ్ కూడా ఉన్నాయి. ఈ కృషి కేవలం చిప్ స్థాయికి పరిమితం కాకుండా మొత్తం కంప్యూటింగ్ వ్యవస్థలలో స్వదేశీ సామర్థ్య విస్తరణపై పెరుగుతున్న శ్రద్ధను ప్రతిబింబించింది.

మరోవైపు స్వదేశీ ప్రాసెసర్ డిజైన్ దిశగా విస్తృత ముందడుగును కూడా ఈ ప్రదర్శన చాటింది. టెలికమ్యూనికేషన్స్, ఆటోమోటివ్ అప్లికేషన్లు, ఏఐ నుంచి నిఘా వరకూ వివిధ రంగాల కోసం దేశీయ అంకుర సంస్థలు, కంపెనీలు. ప్రాసెసర్ సాంకేతికతలు, అప్లికేషన్-నిర్దిష్ట చిప్‌లు, సిస్టమ్ సొల్యూషన్లను భారత సెమీకండక్టర్ వ్యవస్థ రూపొందించడాన్ని కూడా ఈ ప్రదర్శనలో గమనించవచ్చు.

సెమీకండక్టర్ సాంకేతికతలు, ప్రయోగశాలలు, డిజైన్ కేంద్రాల నుంచి దైనందిన ఉత్పత్తులలోకి భారత్ ఏ విధంగా ప్రవేశించగలదో కూడా ఈ ప్రదర్శన సందర్శకులకు తేటతెల్లం చేసింది.స్మార్ట్ ఉపకరణాలు, కనెక్టివిటీ, నిఘా, పారిశ్రామిక వ్యవస్థలు, ఇంధన నిర్వహణ, ఆటోమోటివ్ టెక్నాలజీ తదితర అప్లికేషన్లకు సంబంధించి భారత సెమీకండక్టర్ కంపెనీలు, అంకుర సంస్థలు వివిధ పరిష్కారాలను ప్రదర్శించాయి.

భారత చిప్ డిజైన్ వ్యవస్థలో ప్రముఖ స్థానంలోగల కంపెనీలలో 'వెర్వ్‌సెమి మైక్రోఎలెక్ట్రానిక్స్' ఒకటి. మోటార్ కంట్రోల్, ఎనర్జీ మీటర్లు, డేటా సేకరణ అప్లికేషన్ల కోసం సెమీకండక్టర్ పరిష్కారాలను ఈ సంస్థ రూపొందిస్తోంది. దీంతోపాటు వినియోగదారు ఉపకరణాలు, ఎలక్ట్రిక్ మొబిలిటీ, డ్రోన్ల వంటి అప్లికేషన్ల కోసం చిప్‌ల తయారీ కూడా చేపట్టింది.

విస్తృత ఎలక్ట్రానిక్స్ తయారీ వ్యవస్థను రూపొందించడంలో స్వదేశీ చిప్ డిజైన్ ప్రాధాన్యాన్ని ఇలాంటి అనువర్తన-నిర్దిష్ట సెమీకండక్టర్ ఉత్పత్తులు ప్రస్ఫుటం చేస్తున్నాయి.

స్వదేశీ ప్రాసెసర్ డిజైన్, సెమీకండక్టర్ టెక్నాలజీలలో భారత్ సామర్థ్యాన్ని సి-డాక్ స్వదేశీ 64-బిట్ 'రిస్క్-వి' ప్రాసెసర్ బలోపేతం చేస్తుంది. సార్వత్రిక 'రిస్క్-వి' స్వరూపం ప్రాతిపదికగా ఇది హై-పెర్ఫార్మెన్స్ కంప్యూటింగ్, అత్యాధునిక డిజిటల్ అనువర్తనాలకు తోడ్పాటునిస్తుంది. స్వదేశీ పరిష్కారాలలో భాగంగా దీని అనుసరణ, భావితరం కంప్యూటింగ్, కనెక్టివిటీ, డిజిటల్ మౌలిక సదుపాయాల కోసం అత్యాధునిక ప్రాసెసర్ సాంకేతికతల తయారీలో పెరుగుతున్న స్వదేశీ నైపుణ్యాన్ని ఇది ప్రదర్శిస్తుంది.

స్వదేశీ రిస్క్-వి ప్రాసెసర్ ఐపీలు, ఎస్ఓసీ డిజైన్ ఆటోమేషన్ ఉపకరణాలకు సంబంధించిన తన కృషిని ఇన్‌కోర్ సెమీకండక్టర్స్ ప్రదర్శించింది. ఈ సంస్థ ఉత్పాదనల జాబితాలో ఎంబెడెడ్ సిస్టమ్స్, ఎడ్జ్-ఏఐ వినియోగం వరకూ విస్తరించిన అనువర్తనాలతో విభిన్న స్థాయుల కంప్యూటింగ్ అవసరాలకు అనుగుణంగా రూపొందించిన ప్రాసెసర్ వేదికలున్నాయి. ఇన్‌కోర్ ప్రాసెసర్ ఐపీ-180 ఎన్ఎం నుంచి 16 ఎన్ఎం వరకూ గల సాంకేతిక విభాగాల్లో, పలు వినియోగదారు చిప్‌లలో సిలికాన్ సామర్థ్యాన్ని రుజువు చేసుకుంది.

విస్తృత సెమీకండక్టర్ డిజైన్ వ్యవస్థలో ఇటువంటి ప్రాసెసర్ సాంకేతికతల రూపకల్పన ఓ కీలక భాగం. భారతీయ కంపెనీలు దేశీయంగా రూపొందించిన మేధో సంపత్తి ప్రాతిపదికన ఉత్పత్తుల తయారీకి ఇది వీలు కల్పిస్తుంది.

అహీసా టెక్నాలజీ సంస్థ '1 జీబీపీఎస్' సామర్థ్యంతో స్వదేశీ ఇంటర్నెట్ అనుసంధాన పరికరాన్ని తయారు చేసింది. ఇంటర్నెట్ సేవాప్రదాన సంస్థలు దీని ద్వారా ఒకే ఆప్టికల్ లైన్ టెర్మినల్ (ఓఎల్‌టీ) ద్వారా సుమారు 64 గృహాలను సంధానించగలవు. పూర్తిగా భారత్‌లో రూపొందించిన 'విహాన్' సాఫ్ట్ వేర్ వేదికగా 'సి-డాక్' తయారు చేసిన 64 బిట్ 'రిస్క్-వి' ప్రాసెసర్ ద్వారా ఇది పనిచేస్తుంది.

## వాతావరణ మార్పులను తట్టుకునే నీటి నిర్వహణ, నీటి భద్రత కోసం చేపడుతున్న చర్యలను వివరిస్తూ కేంద్ర మంత్రి శ్రీ సీఆర్ పాటిల్ రాసిన వ్యాసాన్ని ప్రజలతో పంచుకున్న ప్రధానమంత్రి

న్యూ ఢిల్లీ, సెప్టెంబర్ 22:కేంద్ర మంత్రి శ్రీ సీఆర్ పాటిల్ రాసిన ఓ వ్యాసాన్ని ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ప్రజలతో పంచుకున్నారు.

నీటి భద్రత అందరి బాధ్యత అని, ఇందుకోసం పటిష్టమైన వ్యవస్థలు, శాస్త్రీయ పరిష్కారాలు, ప్రజల భాగస్వామ్యం అవసరమని ప్రధానమంత్రి పేర్కొన్నారు. జల్ జీవన్ మిషన్, నమామి గంగే, జల సంరక్షణ, సాంకేతికత ఆధారిత పరిష్కారాల ద్వారా వాతావరణ మార్పులను తట్టుకునే నీటి నిర్వహణ వ్యవస్థలను నిర్మించేందుకు భారత్ చేస్తున్న ప్రయత్నాలను కేంద్ర మంత్రి తన వ్యాసంలో వివరించారని శ్రీ మోదీ తెలిపారు. రాష్ట్రాలు, వివిధ సమాజాలు నిరంతరం చేపట్టే ప్రయత్నాలతో పాటు ప్రజల భాగస్వామ్యం ఉంటే, భవిష్యత్తు తరాలకు నీటిని సుస్థిరంగా ఎలా అందించగలదనే విషయాన్ని ఈ వ్యాసం వివరిస్తుందని ప్రధానమంత్రి అన్నారు.

"నీటి భద్రత అందరి బాధ్యత. ఇందుకోసం పటిష్టమైన వ్యవస్థలు, శాస్త్రీయ పరిష్కారాలు, ప్రజల భాగస్వామ్యం అవసరం. జల్ జీవన్ మిషన్, నమామి గంగే, నీటి సంరక్షణ, సాంకేతికత ఆధారిత పరిష్కారాల ద్వారా వాతావరణ మార్పులను తట్టుకునే నీటి నిర్వహణ వ్యవస్థలను నిర్మించేందుకు భారత్ చేస్తున్న ప్రయత్నాల గురించి కేంద్ర మంత్రి శ్రీ సీఆర్ పాటిల్ రాశారు.రాష్ట్రాలు, వివిధ సమాజాలు నిరంతరం చేపట్టే చర్యలతో పాటు ప్రజల భాగస్వామ్యం తోడైతే, భవిష్యత్తు తరాలకు సుస్థిరమైన రీతిలో నీటి భద్రతను ఎలా కల్పించవచ్చో ఈ వ్యాసం స్పష్టంగా వివరిస్తుంది"

## ధర్మబద్ధ మార్గాన్ని అనుసరిస్తే సంతోషం, సౌభాగ్యం, శ్రేయస్సు కలుగుతాయని చెబుతున్న సుభాషితం... ప్రజలతో పంచుకున్న ప్రధానమంత్రి

న్యూ ఢిల్లీ, సెప్టెంబర్ 22:ధర్మబద్ధ జీవనాన్ని గడపడంతో పాటు సరి అయిన మార్గదర్శకత్వాన్ని అందుకున్నప్పుడు సంతోషాన్నీ, సౌభాగ్యాన్నీ, శ్రేయస్సునీ పొందవచ్చని చెబుతున్న ఓ సంస్కృత సుభాషితాన్ని ప్రజలతో ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈ రోజు పంచుకున్నారు.

సామాజిక మాధ్యమ వేదిక 'ఎక్స్'లో ఒక సందేశాన్ని ప్రధానమంత్రి పొందుపరుస్తూ:

"సుత్రామాణం పృథివీం ద్యామనేహసం సుశర్మాణమదితిం సుప్రణీతిమ్

దైవీం నావం స్వరిత్రామనాగసో అస్రవన్తీమా రుహేమా స్వస్తయే" అని పేర్కొన్నారు.

అన్ని వేళల్లో కాపాడుతూ ఉండే భూమినీ, విశాల అనంత ఆకాశాన్నీ మానవులు ఆశ్రయించి ఉందురు గాక. భూమ్యాకాశాలు వారికి సురక్షిత ఆశ్రయాన్ని ప్రసాదించడంతో పాటు ధర్మపాలనకు దోహదం చేస్తాయి. మానవులు పాపాల నుంచి విముక్తులై, పవిత్ర మార్గంలో ముందుకు సాగుతూ బలమైన, చక్కని పనితనమున్న చుక్కానిని కలిగివున్న ఓ దివ్యనౌక లో ప్రయాణించి సంతోషాన్నీ, సౌభాగ్యాన్నీ, శ్రేయస్సునీ అందించే గమ్యాన్ని చేరుకొందురు గాక అనే ఆకాంక్షను ఈ సుభాషితం వ్యక్తం చేస్తోంది.

# తెలుగు నాటక రంగంలో "స్థానం" వారిది ప్రత్యేక స్థానం

స్థానం నరసింహారావుదిఆంధ్ర నాటకరంగ చరిత్రలో నరసింహారావుది ప్రత్యేక స్థానం. నాటక రంగం మనగలిగినంత కాలం ఆయన పేరు శాశ్వతంగా నిలిచి పోతుంది. ఆయన స్త్రీ పాత్రధారణలో అసాధారణ ప్రజ్ఞ కనబరచి నాటక రంగానికే వన్నె తెచ్చారు. పురుషులే స్త్రీ వేషాలు వేసే ఆ నాటి రోజుల్లో రంగస్థలంపై విభిన్నమైన, పరస్పర విరుద్ధ మయిన పాత్రలను ధరించి, ధరించిన ప్రతి పాత్రలోను తమదైన ప్రత్యేకతను చూపించి లీనమై, ముప్పయి సంవత్సరాల పాటు లక్షలాది మంది ప్రేక్షకులను మంత్ర ముగ్ధుల్ని చేసిన ప్రతిభ ఆయనకే సొంతం.

నటకా వతంస, నటశేఖర, నాటక కళా ప్రపూర్ణ, పద్మశ్రీ వంటి బిరుదులు, పురస్కారాలు ఆయనను వరించాయి.

స్థానం నరసింహారావు (సెప్టెంబర్ 23, 1902 – ఫిబ్రవరి 21, 1971) ప్రసిద్ధ రంగస్థల, తెలుగు సినిమా నటులు. సత్యభామ, చిత్రాంగి మొదలైన అనేక స్త్రీ పాత్రలను సుమారు 40 సంవత్సరాలకు పైగా ధరించి 3వేలకు పైగా ప్రదర్శనలు ఇచ్చారు. ప్రేక్షకాభిమానంతో సహా పద్మశ్రీ పురస్కారం పొందాడు.

స్థానం నరసింహారావు 1902, సెప్టెంబర్ 23 న హనుమంతరావు, ఆదెమ్మ దంపతులకు గుంటూరు జిల్లా బాపట్ల లో జన్మించారు.

ఆయన చిన్నతనంలో కూచిపూడి భాగవతులు వచ్చి బాపట్లలో ప్రదర్శనలు ఇచ్చేవారు. అందులో వెంపటి వెంకటనారాయణ అనే ఆయన భామ వేషం అద్భుతంగా కట్టేవారట. ఆ స్త్రీ వేషం తన మనసులో ఎంతో ఆదరంతో మనసులో నిలిచి పోయి ఉండేదని చెప్పారు. ఈ దృశ్యాలన్నీ ఆయన రంగస్థల ప్రవేశం చేయడానికి దోహదం చేశాయి. 1921లో బాపట్ల లోనే జంట కవులైన తిరుపతి వేంకటకవులకు, కొప్పరపు కవులకు శతావధానం పోటీ జరిగింది. నెగ్గిన తిరుపతి వేంకటకవులని సత్కరించాలని భావించారు. ఆ సందర్భంగా ప్లీడరు గుమాస్తాల బృందం చేత సత్య హరిశ్చంద్ర నాటకం వేయించాలని నిర్ణయించారు. ఆహ్వానాలు వెళ్లిపోయాయి.

కానీ చంద్రమతి వేషధారి అస్వస్థుడై రాలేక పోతున్నట్టు చివరి నిమిషంలో తెలిసింది. ప్రత్యామ్నాయం ఏదీ సాధ్యం కాలేదు. చంద్రమతి పాత్రధారి మరొకరు దొరకలేదు.

మరో నాటకం వేద్దామంటే పాత్రధారులంతా లేరు. గుండెల్లో రాయి పడింది. అప్పుడే ఆపద్బాంధవుడిలా స్థానం దొరికాడు చోరగుడి హనుమంతరావుకు. వారి నాటకం రిహార్సల్స్ జరుగుతున్నప్పుడు వెళ్లి కూర్చోవడంతో పద్యాలన్నీ వచ్చేశాయి. ఒకసారి ఎవరూ లేనప్పుడు పాడుకుంటూ ఉంటే హనుమంతరావు విన్నాడు.

ఆ ధైర్యంతోనే చంద్రమతి వేషం వేయించాడు. స్థానం వారికి చిన్నతనం లోనే చిత్రలేఖనం కూడా అబ్బింది. ఆ కళతోనే, వేరే ఒకరి ఇంట రహస్యంగా

**సెప్టెంబర్ 23...స్థానం నరసింహారావు జయంతి**



తన వేషం తనే వేసుకున్నారాయన. చిన్న చిన్న లోపాలు ఉన్నా అరంగేట్రంలోనే తిరుపతి కవుల ఆశీస్సులు అందుకున్నారు స్థానం.

తెనాలిలోని శ్రీరామ విలాస సభలో ప్రవేశించి ఆకాలంలోని గొప్ప నటులందరి సరసన పాత్రలు ధరించి దేశమంతటా పర్యటించి అపారమైన అనుభవం సంపాదించారు.

వరంగల్‌లో 'కృష్ణలీల' నాటకంలో యశోద వేషం వేసినందుకు ఆయన జీవితంలో తొలి బంగారు పతకం వచ్చింది. అనతికాలంలోనే ఆయన పేరు మారుమోగి పోయింది.

కాపురం బాపట్ల నుంచి తెనాలికి మారింది. శ్రీరామవిలాస సభ అనే నాటక సమాజాన్ని స్థాపించి నటననే జీవికగా చేసుకున్నారు. రోషనార (రోషనార నాటకం), తామినా (రుస్తుం సొహరాబ్ నాటకంలో), సంయుక్త (రాణీ సంయుక్త), శకుంతల (అభిజ్ఞాన శాకుంతలం), సత్యభామ (శ్రీకృష్ణ తులాభారం), చిత్రాంగి (సారంగధర), దేవదేవి (విప్ర నారాయణ), కోకిల (కోకిల నాటకం), మల్లమ్మ (బొబ్బిలి), మధుర వాణి (కన్యాశుల్కం), అనసూయ (అనసూయ నాటకం), మురాదేవి (చంద్రగుప్త), చింతామణి (చింతామణి), సుభద్ర (వీరాభిమన్య), సరళ (ఛత్రపతి శివాజీ), విద్యాధరి (కాళిదాసు), చండిక (చండిక నాటకం) వంటి పాత్రలు వేశాడు.

ఆంధ్రదేశంలో దాదాపు 3,000 సార్లు రంగస్థలం మీద పౌరాణిక, చారిత్రక, సాంఘిక నాటకాలలో స్త్రీ పాత్రలను ధరించి ప్రజాభిమానాన్ని చూరగొన్నాడు. శృంగార రసాన్ని ప్రతిబింబించే రీతిలో సత్యభామ పాత్ర, ప్రణయానికి చిత్రాంగిగా, వీరరసాన్ని చిత్రించడంలో రోషనార నాటకంలో రోషనారగా, వలపుల చింతామణిగా, ప్రణయ దేవతగా, భక్తురాలిగా, దేవదేవిగా, మధురాతి మధురమైన మధురవాణిగా నవరసాలు కలిగిన పాత్రలను ప్రతిభా వంతంగా పోషించాడు. వేషధారణ, వస్త్రాలంకరణలో స్థానం వారిది ఒక ప్రత్యేకత. రకరకాల చీరకట్టు సొగసులతో మనోహరంగా రంగస్థానం మీదకు ప్రవేశించి ప్రేక్షకుల్ని మంత్రముగ్ధుల్ని చేశాడు.

వీరు సినీ రంగంలో రాధాకృష్ణ (1939), సత్యభామ భామ వంటి కొన్ని సినిమాలలో నటించారు. తన నటనానుభవాలను చేర్చి "నటస్థానం" అనే గ్రంథాన్ని ఆయన రచించాడు.

స్థానం నరసింహారావు 1971 ఫిబ్రవరి 21 తేదీన మరణించాడు.

1956లో భారత ప్రభుత్వం ఆయనను పద్మశ్రీ పురస్కారంతో సత్కరించింది. ఆయన ఈ బహుమతిని పొందిన తొలి ఆంధ్రుడు, కళాకారుడు.

ఆయన రంగ స్థలం పై చూపించిన సమయస్ఫూర్తికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 10వ తరగతి తెలుగు వాచకంలో ఒక పాఠం కూడా పెట్టింది. ఆయన నటనకు ముగ్ధులైన రంగూన్ ప్రజలు 1938లో బంగారు కిరీటాన్ని బహూకరించారు.



–రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494

---

# వేములవాడలో సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

## -పేదలకు అండగా సీఎం సహాయ నిధి తుమ్ మధు



రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ 22:(నేటినిజం ప్రతినిధి): పట్టణానికి చెందిన పలువురు లబ్ధిదారులకు మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కులను సోమవారం పంపిణీ చేశారు. ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ నివాసంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తుమ్ మధు చేతుల మీదుగా లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా తుమ్ మధు మాట్లాడుతూ.. ఆపదలో ఉన్న పేదలకు ప్రభుత్వం సీఎం సహాయ నిధి ద్వారా భరోసా కల్పిస్తోందన్నారు. ఆది శ్రీనివాస్ ఎమ్మెల్యేగా గెలిచిన అనంతరం అర్హులైన లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి చెక్కులు త్వరితగతిన అందేలా చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. నిరుపేదలు పెద్ద జబ్బులతో ఇబ్బందులు పడుతున్న సమయంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ చొరవతో ఎల్ఓసీలు మంజూ రవుతున్నాయని పేర్కొన్నారు. రానున్న రోజుల్లోనూ పేదలకు ప్రభుత్వం, ఆది శ్రీనివాస్ అండగా ఉంటారని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, వైస్ చైర్మన్ నరాల శేఖర్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కనికరపు రాకేష్, కౌన్సిలర్లు కుక్కుల బాలకృష్ణ, కాస శ్రీనివాస్, కొండా శేఖర్, సీనియర్ నాయకులు చిలుక రమేష్, పులి రాంబాబు, దూాల భూవేష్, వల్లపు రాజేందర్, మూడోపల్లి నాగరాజు, చిలివేరి శ్రీనివాస్, పీర్ మహమ్మద్, అబ్దుల్ రజాక్, వస్తాది కృష్ణ, ముప్పిడి శ్రీనివాస్, కాసారపు తిరుపతి, పోతుగంటి వెంకన్న, తుమ్మ ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

# ఎంజీఎం హాస్పిటల్‌కు నిధులు ఖర్చు చేయడంలేదు..

# నిజం ఒప్పుకున్న కాంగ్రెస్ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి



హన్మకొండ, సెప్టెంబర్ 22:(నేటినిజం ప్రతినిధి)వరంగల్ ఎంజీఎం హాస్పిటల్‌కు నిధులు ఖర్చు చేయడంలేదని వరంగల్ పశ్చిమ కాంగ్రెస్ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ఒప్పుకున్నారు. త్వరలోనే వరంగల్ సూపర్ స్పెషాలిటీ ప్రారంభం అవుతుంది కదా అందుకే నిధులు ఖర్చు చేయలేదని అందుకే ఎంజీఎం దవాఖానకు ఈ దుస్థితి పట్టిందన్నారు. మంగళవారం హనుమకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. వరంగల్ ఎంజీఎం దవాఖాన శిథిలావస్థకు చేరి పెచ్చులూడుతున్నాయి.

దవాఖానకు కావాల్సిన వసతులు, సౌకర్యాలు కల్పించడంలేదని, నిధులు ఖర్చు చేయలేదన్నారు.

వచ్చేనెల సీఎం చేతుల మీదుగా ప్రారంభించే సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ కావాల్సిన పరికరాలను, సదుపాయాలను సమకూర్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. కొందరు డాక్టర్ల స్వార్థంతో ఎంజీఎం నిర్లక్ష్యానికి గురవుతుంది, ఎంజీఎం దవాఖానలో వైద్యులు అందుబాటులో ఉండటంలేదన్నారు.

గతంలో ఇన్‌స్పెక్షన్ చేసినప్పుడు వైద్యులు ఎంజీఎంకు రావడంలేదని, ప్రైవేటు క్లినిక్‌లోనే ఎక్కువగా ఉంటున్నారని తెలిపారు. ప్రస్తుతం ప్రారంభించనున్న సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో ఇలాంటి పొరపాట్లు జరగకుండా స్పెషల్ ఆఫీసర్‌గా ఒక ఐఏఎస్ ఆఫీసర్‌ను నియమించాలన్నారు. హనుమకొండలో జీరో క్రైమ్ రేట్, ఎక్కడా కూడా ఒక్క కబ్జా లేదన్నారు.

రాముడి పేరిట 105 సార్లు బీజేపీ దోచుకున్నదన్నారు. వరంగల్ ఎయిర్‌పోర్టుకు డూప్లికేట్ గాంధీ పేరు పెడతారని బండి సంజయ్ అనడం సరైంది కాదని, గాంధీ కుటుంబం గురించి మాట్లాడే స్థాయి లేదన్నారు. డీసీసీ అధ్యక్షుడు ఇనుగాల వెంకట్రామిరెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి బొద్దిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, పీసీసీ సభ్యులు బత్తిని శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



# బీజేపీ గణపతి మండపం వద్ద హోమం

రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ 22:(నేటినిజం ప్రతినిధి): వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పాత ఆంధ్రాబ్యాంక్ ముందు ఏర్పాటు చేసిన గణేష్ మండపం వద్ద మంగళవారం గణేష్ హోమం నిర్వహించారు. భక్తిశ్రద్ధలతో నిర్వహించిన హోమంలో పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు కుమ్మరి శంకర్, వంగల శ్రీనివాస్, బోనాల సాగరిక, శివప్రతాప, హిమబిందు, బీఆర్ఎస్ నాయకులు ఏనుగు మనోహర్‌రెడ్డి, ద్వారక శ్రీదేవి, శాంతి, మహేష్, రేగుల మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

# అండర్‌గ్రౌండ్ డ్రైనేజీకి

# రూ.40 కోట్ల అదనపు నిధులు

అమరావతి, సెప్టెంబర్ 22: నాగర్‌కర్నూల్ పట్టణ అభివృద్ధికి మరో ముందడుగు పడిందని మున్సిపల్ చైర్మన్ తీగల సునీంద్ర తెలిపారు. పట్టణంలోని అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ సౌకర్యం లేని వీధులకు డ్రైనేజీ వసతి కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అదనంగా రూ.40 కోట్ల నిధులు మంజూరు చేసిందని మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్‌రెడ్డి, ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి కృషితో ఈ నిధులు మంజూరయ్యాయని తెలిపారు. మున్సిపల్ పరిధిలోని గ్రామాలు, పట్టణ ప్రాంతాల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నామని, ప్రజల కోసం పనిచేస్తూ ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు. ప్రజల సహాయ సహకారాలతో నాగర్‌కర్నూల్ పట్టణాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని సునీంద్ర తెలిపారు. అండర్‌గ్రౌండ్ డ్రైనేజీకి రూ.40 కోట్ల అదనపు నిధులు మంజూరు చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

# 'మత్తు మాయలో పడొద్దు.. భవిష్యత్ నాశనం చేసుకోవద్దు'

## -ఎక్సైజ్ శాఖ ఖమ్మం జిల్లా డిప్యూటీ కమిషనర్ సోమిరెడ్డి

ఖమ్మం, సెప్టెంబర్ 22: మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే అనర్థాలు, ఆరోగ్యంపై పడే దుష్ప్రభావాలపై ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ శాఖ కారేపల్లి సర్కిల్ ఆధ్వర్యంలో మంగళవారం కారేపల్లి మండల కేంద్రంలో గల ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిపార్ట్‌మెంట్ ఖమ్మం జిల్లా డిప్యూటీ కమిషనర్ ఎం.సోమిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు మత్తు పదార్థాల వల్ల కలిగే నష్టాలను వివరించారు. మత్తు పదార్థాలకు అలవాటు పడడం వల్ల విద్యార్థుల చదువులు, ఆరోగ్యం, కుటుంబ జీవితం, భవిష్యత్‌పై తీవ్ర ప్రభావం పడుతుందని తెలిపారు.

విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ చదువుపై దృష్టి సారించాలని, తమ చుట్టూ ఉన్నవారిలోనూ మత్తు పదార్థాల విపరిణామాలపై అవగాహన కల్పించాలని సూచించారు. యువత మత్తు పదార్థాలకు ఆకర్షితులు కాకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, అధికారులు సమన్వయంతో పని చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ

---

# సోషల్ మీడియా పోస్టులపై పోలీసుల నిఘా

## శాంతిభద్రతలకు విఘాతం కలిగించే పోస్టులు చేస్తే క్రిమినల్ కేసులు

## – సిరిసిల్ల డీఎస్పీ నాగేంద్రచారి

రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ 22:(నేటినిజం ప్రతినిధి): సోషల్ మీడియా వేదికగా మతవిద్వేషాలను రెచ్చగొట్టేలా, ఇతరుల మనోభావాలను దెబ్బతీసేలా లేదా శాంతిభద్రతలకు విఘాతం కలిగించే విధంగా పోస్టులు చేయడం, అసత్య ప్రచారాలను షేర్ చేయడం, ఫార్వర్డ్ చేయడంపై నిఘా కొనసాగుతోందని సిరిసిల్ల డీఎస్పీ నాగేంద్రచారి తెలిపారు. ఫేస్‌బుక్, వాట్సాప్, ట్విట్టర్, ఇన్‌స్టాగ్రామ్ తదితర సామాజిక మాధ్యమాల్లో మతవిద్వేషాలకు దారితీసే, ఇతరుల మనోభావాలను దెబ్బతీసే అసత్య ప్రచారాలు, అభ్యంతరకర పోస్టులు చేయడం లేదా వాటిని ఫార్వర్డ్ చేయవద్దని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించి ఇలాంటి పోస్టులు చేసినా, షేర్ లేదా ఫార్వర్డ్ చేసినా సంబంధిత అడ్మిన్లతో సహా బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అవసరమైతే నిందితులపై హిస్టరీ షీట్లు కూడా తెరవడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలు పోలీస్ శాఖకు సహకరించాలని డీఎస్పీ నాగేంద్రచారి కోరారు.

# దేశంలోని ఉత్తమ పర్యాటక ప్రదేశాలకు జాతీయ చలనచిత్ర పురస్కారాలు

న్యూ ఢిల్లీ, సెప్టెంబర్ 22: జాతీయ కార్యక్రమాలను సంప్రదాయ వేదికలకు పరిమితం చేయకుండా దేశవ్యాప్తంగా ఉన్న పర్యాటక ప్రాంతాలతో అనుసంధానం చేయాలన్న ప్రధానమంత్రి శ్రీ నరేంద్రమోదీ ఆలోచన స్ఫూర్తితో జాతీయ చలనచిత్ర పురస్కారాలను దేశంలోని అత్యుత్తమ పర్యాటక ప్రదేశాలకు తీసుకెళుతున్నట్టు కేంద్ర సమాచార ప్రసార శాఖమంత్రి శ్రీ అశ్వనీ వైష్ణవ్ ఈ రోజు తెలియజేశారు.

"ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ స్ఫూర్తితో జాతీయ చలన చిత్ర పురస్కారాలను ఉత్తమ పర్యాటక ప్రదేశాలకు తీసుకెళతాం" అని శ్రీ అశ్వనీ వైష్ణవ్ మీడియాతో అన్నారు.

ప్రపంచంలోనే అత్యంత ఎత్తయిన విగ్రహం ఉన్న ఏక్తానగర్ ఆకర్షణీయమైన పర్యాటక ప్రాంతంగా ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకుందని ఆయన చెప్పారు. భారత రాష్ట్రపతి, భారతీయ చలనచిత్ర పరిశ్రమలోని ప్రముఖులు ఇలాంటి ప్రసిద్ధ పర్యాటక కేంద్రాన్ని సందర్శిస్తే.. ఆ ప్రాంతం గురించి తెలుసుకొనే, అనుభూతి చెందే అవకాశం మరింత మందికి లభిస్తుందని చెప్పారు.

జాతీయ చలనచిత్ర పురస్కారాలను కాన్ఫరెన్స్ రూమ్‌కే పరిమితం చేయకుండా ప్రజలకు మరింత చేరువ చేసేందుకు, పర్యాటకం ద్వారా ప్రోత్సహించి, మరింత ముందుకు తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తున్నామని మంత్రి చెప్పారు.

జాతీయ చలన చిత్ర పురస్కారాలకు ఆతిథ్యమిచ్చేందుకు తమ పరిధిలోని ఉత్తమ పర్యాటక ప్రాంతాలను గుర్తించి, ప్రతిపాదనలను పంపాలని అన్ని రాష్ట్రాలను శ్రీ అశ్వనీ వైష్ణవ్ ఆహ్వానించారు. ఉత్తమ సౌకర్యాలతో పాటు ఆయా ప్రాంతాల సమగ్రాభివృద్ధికి సంబంధించిన ప్రణాళికలు కూడా ఆ ప్రతిపాదనల్లో ఉండాలని ఆయన సూచించారు. ఎంపికైన ప్రతిపాదనను పంపిన రాష్ట్రం... తాను సూచించిన పర్యాటక ప్రాంతంలోనే తదుపరి జాతీయ చలన చిత్ర పురస్కారాలకు ఆతిథ్యమిస్తుంది.

గతంలో జీ 20 సదస్సును ప్రధాని శ్రీ నరేంద్ర మోదీ దేశంలోని వివిధ ప్రాంతాలు, రాష్ట్రాల్లో నిర్వహించిన విషయాన్ని మంత్రి ఈ సందర్భంగా గుర్తు చేశారు. సినిమా, పర్యాటక రంగాలను ఎలా అనుసంధానించవచ్చో అన్వేషించే విస్తృత ఆలోచనా ప్రక్రియలో భాగంగా జాతీయ చలనచిత్ర అవార్డులను దేశవ్యాప్తంగా తీసుకెళతామని ఆయన తెలియజేశారు.

సినిమా, పర్యాటక రంగాలను ఒక చోట చేర్చడం వల్ల పర్యాటక ప్రాంతాలకు లబ్ధి చేకూరుతుందని శ్రీ అశ్వనీ వైష్ణవ్ అన్నారు. అలాగే జాతీయ చలన చిత్ర పురస్కారాలు కాన్ఫరెన్స్ రూమ్‌కే పరిమితం కాకుండా దేశవ్యాప్తంగా ఉన్న భౌగోళిక ప్రాంతాలకు చేరుకొనే వీలు కలుగుతుందని శ్రీ అశ్వనీ వైష్ణవ్ అన్నారు.

# ఏసీబీకి పట్టుపడ్డ జీపీవో దుర్గాప్రసాద్

## భీమిని మండలంలో ఏసీబీ దాడి..

హైదరాబాద్, సెప్టెంబర్ 22: మంచిర్యాల జిల్లా భీమిని మండలంలో ఏసీబీ దాడి కలకలం రేపింది. భీమిని మండలం పెద్దపేట గ్రామపంచాయతీ పరిధిలో సర్వే నెంబర్ 10లో 29 గుంటల భూమిని సాదా బైనమా ద్వారా పట్టా మార్పు కోసం మహమ్మద్ ఫకీర్ అనే రైతు వద్ద ఒక లక్ష 30వేల రూపాయలకు జిపిఓ దుర్గాప్రసాద్ బేరం కుదుర్చుకున్నాడు. మొదటగా రైతు వద్ద నుండి జీపీవో దుర్గ ప్రసాద్ 20వేల రూపాయలను లంచంగా తీసుకున్నాడు.

లో పెద్దపేట గ్రామపంచాయతీ పరిధిలో మరో 80వేల రూపాయలను లంచంగా తీసుకుంటున్న జీపీవో దుర్గాప్రసాద్, కిరాణా షాప్ యజమాని పోతు రాజేందర్‌లను ఆదిలాబాద్ ఏసీబీ డీఎస్పీ మధు పట్టుకున్నారు. జీపీవో



దుర్గాప్రసాద్, కిరాణా షాప్ యజమాని పోతు రాజేందర్ ను అదుపులోకి తీసుకొని భీమిని తహశీల్దార్ కార్యాలయంలో ఏసీబీ అధికారులు విచారించారు. అనంతరం జీపీవో దుర్గ ప్రసాద్ పై కేసు నమోదు చేసి కరీంనగర్ ఏసీబీ కోర్టులో హాజరుపరచనున్నట్లు ఏసీబీ మధు తెలిపారు. ప్రభుత్వ విధుల్లో ఉన్న అధికారులు లంచం డిమాండ్ చేస్తే ఏసీబీ అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana.
Published at SRT-74, Jawahar nagar, Ashok nagar,Hyderabad-500020. Telangana.
'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93.